

గూడూరు గిరిజన బాలికల పాఠశాలలోని పోలింగు కేంద్రం వద్ద క్యూలైన్లో ఓటర్లు



ఓటోత్సాహం

పోలింగ్ 76.83 శాతం

పోలింగ్ శాతం	
స్థానం	రాత్రి 10.30
గూడూరు	74.37
సూళ్ళూరుపేట	80.69
వెంకటగిరి	80.03
చంద్రగిరి	79.34
తిరుపతి	59.95
శ్రీకాళహస్తి	83.00
సత్యవేడు	84.28
జిల్లా మొత్తం	76.83

తిరుమలలో ఓటేసిన యువతులు

తిరుపతిలోని దొడ్డాపురం వీధిలో దొంగ ఓటర్ల పరిస్థితి



ఏర్పేడు మండలం మడిబాకలో తల్లిని ఓటింగుకు తీసుకెళుతున్న యువకుడు

ఓటోత్సాహం వెల్లివిరిసింది. తెల్లవారేసరికే పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు తరలివచ్చి మున్నెన్నడూ లేని చైతన్యాన్ని చాటుకున్నారు. గేట్లు తెరవకముందే చేరుకుని క్యూలైన్‌లో బారులు తీరారు.ఎండ, ఉక్కపోతలను బేఖాతరు చేశారు. ఈవీఎంలు మొరాయించినా గంటల కొద్దీ సహనంగా నిరీక్షించారు.నిబంధనల మేరకు సాయంత్రం 6గంటలకు క్యూలో ఉన్న ఓటర్లు రాత్రి 12 గంటల తర్వాత కూడా ఓటు హక్కు వినియోగించుకున్నారు.

తిరుపతి, మే 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా సోమవారం జరిగిన పోలింగ్‌లో ఒకటి రెండు చోట్ల టీడీపీ, వైసీపీ వర్గీయుల నడుమ జరిగిన ఘర్షణలు పోలీసు కాల్పులకు, లాఠీఛార్జీలకు దారితీసి ఉద్రిక్తతలకు కారణమయ్యాయి. వీటితో పాటు చెదురుమదురు ఘటనలు మినహా ప్రశాంతంగానే పోలింగ్ ముగిసింది. పలుచోట్ల ఈవీఎంలు మొరాయించడంతో అరగంట నుంచీ గంట పాటు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది.



ఎ.రంగంపేటలో ఓటేసిన మోహన్‌బాబు, విష్ణు

చెదురుమదురు ఘటనలు

- రేణిగుంట మండలం కరకంబాడి 131వ బూత్ వద్ద ప్రచారం చేస్తున్న వైసీపీ వారిని టీడీపీ వారు వారించడంతో వైసీపీ ఎంపీపీ హరిప్రసాద్‌రెడ్డి వర్గీయులు దౌర్జన్యం చేశారు.
- డక్కిలి మండలం అల్తూరుపాడులో ఓ కానిస్టేబుల్ వైసీపీ నాయకులకు మద్దతుగా పని చేస్తున్నాడని టీడీపీ నాయకులు గొడవకు దిగారు.
- పెళ్ళకూరు మండలం రావులపాడు బూత్ వద్ద వైసీపీ, టీడీపీ వర్గీయుల నడుమ వాగ్వాదం చోటుచేసుకుంది.
- చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి స్వగ్రామమైన తుమ్మలగుంట హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో పోలింగ్ ప్రక్రియ ముగిశాక ఉద్రిక్తత నెలకొంది. టీడీపీ ఏజెంట్‌గా వ్యవహరించిన దొడ్ల కరుణాకర్‌రెడ్డి బూత్ నుంచి వెలుపలకు వచ్చారు. అప్పటికే గేట్ వద్ద ఉన్న చెవిరెడ్డి సోదరుడు రఘు టీడీపీకి అనుకూలంగా ఓట్లు వేయిస్తున్నారంటూ తీవ్ర ఆగ్రహంతో దొడ్లపైకి దూసుకొచ్చాడు.పోలీసులు ముందు జాగ్రత్తగా అతడిని అదుపులోకి తీసుకుని లోపలకు తీసుకెళ్ళిపోయారు.



పోలింగు ముగించుకుని స్ట్రాంగ్‌రూముకు బయల్దేరిన సిబ్బంది



తిరుపతిలోని సత్యనారాయణపురం జడ్పీ స్కూల్ వద్ద ఓటర్ల క్యూలైన్(ఇన్‌సెట్‌లో) - నాగలాపురం మండలం వజ్జావారి కండ్రిగలో రాత్రి పది గంటలకు కూడా క్యూలో ఉన్న ఓటర్లు

పలుచోట్ల లాఠీఛార్జి

నాయుడుపేట టౌన్, మే 13: నాయుడుపేట మండలం అన్నమేడు గ్రామంలో పోలింగు బూత్ వద్ద వైసీపీ వర్గీయుడు తిరుగుతుండగా ప్రత్యర్థులు అభ్యంతరం తెలిపారు.దీంతో టీడీపీ, వైసీపీ వర్గీయుల నడుమ వివాదం చోటుచేసుకుని పరస్పరం తోపులాటకు దిగారు. ఘర్షణ తలెత్తే పరిస్థితులుండడంతో విధుల్లో వున్న ఎస్‌ఐ గోపీనాథ్ సిబ్బందితో కలసి లాఠీఛార్జి చేశారు.సమీపంలో ఉన్న ఓ ఇంటిలోకి ముగ్గురు వ్యక్తులు పరిగెత్తారు. ఎస్‌ఐ లాఠీతో వారిని తరిమేక్రమంలో ఆ ఇంటిముందు కూచున్న వృద్ధురాలు జులేఖాబీ (70) తలపై లాఠీ తగిలింది. దీంతో రక్తస్రావం జరిగి వృద్ధురాలు ఆమె తీవ్రంగా గాయపడింది. గ్రామస్తులు ఆమెను నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వరదయ్యపాలెం మండలం కువ్వాకొల్లులో పోలింగ్ బూత్‌కు వంద మీటర్ల దూరంలో టీడీపీ వర్గీయులు వేసుకున్న శిబిరాన్ని ఎస్‌ఐ ప్రతాప్ ధ్వంసం చేసినంత పనిచేశారు. ప్రశ్నించిన టీడీపీ వర్గీయులపై లాఠీ ఝుళిపించి వీరంగం చేశారు. దీంతో ఆగ్రహించిన గ్రామస్తులు, టీడీపీ వర్గీయులు పోలీసు వాహనాన్ని అడ్డుకుని ఆందోళనకు దిగారు. ఏర్పేడు మండలం కోబాకలో పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ నాయకులు క్యూలైన్ సమీపానికి వెళ్ళి ఓటర్లను మద్దతు కోరుతుండగా టీడీపీ వర్గీయులు అభ్యంతరపెట్టారు. దీంతో ఇరువర్గాలూ వాగ్వాదానికి దిగడంతో ఘర్షణలు జరగకుండా పోలీసులు చెదరగొట్టారు.

బ్రాహ్మణ కాల్వలో ఉద్రిక్తత:గాల్లోకి కాల్పులు

రామచంద్రాపురం/తిరుచానూరు, మే 13 : రామచంద్రాపురం మండలం బ్రాహ్మణ కాల్వ గ్రామంలో సోమవారం మధ్యాహ్నం వైసీపీ, టీడీపీ ఏజెంట్ల మధ్య వివాదం చెలరేగి ఘర్షణలకు దారి తీసింది. కళ్ళు సరిగా కనిపించని ఓటరు వెంట సహాయకుడు బూత్‌లోకి వెళ్ళడానికి వైసీపీ ఏజెంట్ అభ్యంతరం చెప్పారు. ఇరుపార్టీల ఏజెంట్ల నడుమా మాటామాటా పెరిగింది. టీడీపీ ఏజెంట్‌గా వ్యవహరిస్తున్న మాజీ సర్పంచ్‌పై వైసీపీ వర్గీయులు దాడి చేసి కొట్టారు. ఘర్షణలో బూత్ లోపల ఫర్నిచర్ కూడా ధ్వంసమైంది. ఆ గ్రామం టీడీపీకి కంచుకోట కావడం, మాజీ సర్పంచ్‌ను వైసీపీ వారు కొట్టడంతో గ్రామస్తులు కోపోద్రిక్తులయ్యారు. అందరూ ఏకమై పోలింగ్ బూత్ వద్ద మొహరించారు. బూత్‌లోకి దూసుకెళ్ళేందుకు యత్నించగా అక్కడే వున్న బీఎస్ఎఫ్ జవాన్ నాలుగు రౌండ్లు గాలిలోకి కాల్పులు జరిపారు.



సమాచారమందుకుని వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి భారీ ఎత్తున అనుచరులతో గ్రామానికి చేరుకుని పోలింగ్ బూత్‌లోకి వెళ్ళి టీడీపీ ఏజంట్లపై దౌర్జన్యం చేశారు. పోలీసులు ఆయన్ను వెలుపలికి తీసుకు రాగా తమ ఏజంట్లపై దాడి చేసిన వారెవరో బయటికి రండిరా తేల్చుకుందాం అంటూ సవాళ్ళు విసిరారు. ఆయన అనుచరులు భారీగా వుండడం, మరోవైపు గ్రామస్తులు మూకుమ్మడిగా మొహరించడంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అదే సమయంలో మొబైల్ ఫోన్‌లో వీడియో తీస్తున్న ఆంధ్రజ్యోతి విలేకరి రాజును ఎవడ్రా నువ్వు అంటూ దౌర్జన్యం చేశారు. చేతిలోవున్న మొబైల్ ఫోన్ లాక్కుని దాడికి యత్నించారు. దీంతో పోలీసులు లాఠీఛార్జి చేసి అందరినీ చెదరగొట్టారు. సాయంత్రం 6 గంటల తర్వాత మళ్ళీ గ్రామానికి వస్తానని, అందరి కథా తేలుస్తానని హెచ్చరికలు జారీ చేసి మోహిత్‌రెడ్డి వెనుదిరిగారు. తర్వాత కొద్దిసేపటికి టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ అక్కడకు చేరుకుని పార్టీ ఏజెంట్లను పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రత్యర్థులు రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, సంయమనం పాటించాలని గ్రామస్తులను శాంతపరిచారు.ఈఆర్వో నిశాంత్‌రెడ్డి కూడా వైసీపీకి అనుకూలంగా వ్యవహరిస్తున్నాడని, సాక్ష్యాధారాలతో ఈసీకి ఫిర్యాదు చేస్తామన్నారు. అదనపు ఎస్పీ ఆధ్వర్యంలో పోలీసు బలగాలు చేరుకోవడంతో ఉద్రిక్తత సడలింది. కాగా ఈ వివాదంతో మధ్యాహ్నం 1 గంట నుంచీ 3 గంటల వరకూ రెండు గంటల పాటు పోలింగ్ ఆగిపోయింది.ఈ ఘటనపై కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ విచారణకు ఆదేశించారు.సొరకాయలపేట పోలింగ్ కేంద్రంలో వైసీపీ ఏజెంట్ ఫ్యాన్ సింబల్‌తో ప్రచారం చేస్తుండగా టీడీపీ నేతలు వాగ్వాదానికి దిగారు.



ఎస్‌ఐ ఓవరాక్షన్‌తో టీడీపీ అభ్యర్థి సహా నేతలకు గాయాలు

చిల్లకూరు, మే 13: ఓ పోలింగ్‌బూత్‌లో ఇరుపార్టీల మధ్య చోటుచేసుకున్న చిన్నవివాదం కారణంగా ఎమ్మెల్యే అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్, మరో ముగ్గురు టీడీపీ నేతలకు గాయాలయ్యాయి.చిల్లకూరులోని 114, 115 పోలింగ్ బూత్‌ల ఆవరణలో సోమవారం మధ్యాహ్నం జరిగిన ఈ సంఘటన వివరాలు ఇలావున్నాయి. వైసీపీ అభ్యర్థి మేరిగ మురళీధర్ 10మంది నాయకులతో కలిసి గుంపుగా పోలింగ్ బూత్‌లోకి వెళుతుండగా అక్కడే ఉన్న టీడీపీ నాయకుడు కొండా రామచంద్రారెడ్డి అభ్యంతరం తెలిపారు. దీంతో మేరిగ మురళీధర్, గూడూరు మండలం మంగళపూరుకు చెందిన ఎద్దల నరేంద్రరెడ్డి ఆయనతో వాగ్వాదానికి దిగారు. అంతలో వైసీపీ నేత నరేంద్రరెడ్డి టీడీపీ నేత రామచంద్రారెడ్డిపై చేయి చేసుకుంటుండగా ఎస్‌ఐ అంజిరెడ్డి కూడా అత్యుత్సాహం ప్రదర్శించారు. టీడీపీ నేత కొండా రామచంద్రారెడ్డిపై ,పక్కనే వున్న మహిళానేత మద్దాలి విజయ, వెంకటరామయ్యలపై లాఠీ ఝుళిపించారు. దీంతో ముగ్గురికి గాయాలయ్యాయి. సమాచారం అందుకుని సంఘటనా స్థలానికి వచ్చిన టీడీపీ అభ్యర్థి సునీల్‌కుమార్ ఎందుకు తమ వారిని కొడుతున్నారని ప్రశ్నించగా కొంత ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఇరువర్గాల తోపులాటలో సునీల్‌కుమార్ చేతికి కూడా గాయమైంది. చిన్నవివాదం కాస్తా ఎస్‌ఐ అంజిరెడ్డి అత్యుత్సాహంతో పెద్దదైంది. గాయపడ్డ టీడీపీ నాయకులను చికిత్సనిమిత్తం గూడూరు ఏరియా ఆసుపత్రికి పార్టీ వర్గాలు తరలించారు.



గాయపడ్డ సునీల్‌కుమార్



గాయపడ్డ విజయ



కమ్మవారిపాలెం గ్రామస్తుల నిరసన

రెండు చోట్ల పోలింగ్ బహిష్కరణ

నాయుడుపేట టౌన్, మే 13: నాయుడుపేట మండలం కమ్మవారిపాలెంలో గ్రామస్తులు పోలింగ్‌ను బహిష్కరించారు. తమ గ్రామానికి కనీస సదుపాయాలు కూడా లేవని, వాటిని కల్పించే వరకూ ఓటు వేసేది లేదని పోలింగ్‌ను బహిష్కరించారు. మధ్యాహ్నం 3 గంటల వరకు ఓటింగ్‌లో పాల్గొనలేదు.చివరకు టీడీపీ నేతల హామీతో ఓటింగ్‌లో పాల్గొన్నారు. కేవీబీపురం మండలం పాతపాలెం పంచాయతీ కేసీ కండ్రిగలో సైతం మౌలిక సదుపాయాలు లేవని ఆరోపిస్తూ పోలింగ్‌ను గ్రామస్తులు బహిష్కరించారు.చివరకు అధికారులు సర్ది చెప్పడంతో ఓటింగులో పాల్గొన్నారు.

చెరివిలో ఓటర్లకు విద్యుత్ షాక్

సత్యవేడు మండలం చెరివి గ్రామంలో ఎన్నికల పోలింగ్ కేంద్రం ఓ రేకుల షెడ్‌లో ఏర్పాటు చేశారు. పోలింగ్ జరుగుతుండగా షార్ట్ సర్క్యూట్ జరిగి బూత్‌లోని వారంతా షాక్‌కు గురయ్యారు. ఒక ఓటరు స్వలంగా గాయపడ్డారు.

కూచువారిపల్లిలో తీవ్ర ఉద్రిక్తత

- వైసీపీ దాడిలో నలుగురు టీడీపీ కార్యకర్తలకు గాయాలు
- ఆగ్రహంతో టీడీపీ వర్గీయుల ప్రతిదాడి
- వైసీపీ సర్పంచ్ ఇల్లు సహా రెండు కార్లు దగ్ధం
- చంద్రగిరి వైసీపీ అభ్యర్థి మోహిత్ గన్‌మెన్ నిర్బంధం... తర్వాత విడిచిపెట్టిన వైనం


చంద్రగిరి,మే13: చంద్రగిరి మండలం కూచువారిపల్లిలో సోమవారం రాత్రి తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రామిరెడ్డిపల్లి పోలింగ్ కేంద్రంలో ఓటింగ్ సందర్భంగా వైసీపీ, టీడీపీ వర్గీయుల నడుమ జరిగిన స్వల్ప వివాదం చిలికిచిలికి గాలివానగా మారి పొరుగునే వున్న కూచువారిపల్లిలో పరస్పరం దాడులకు దారి తీసింది. తొలుత వైసీపీ వర్గీయులు రాత్రి కూచువారిపల్లి చేరుకుని టీడీపీ కార్యకర్తలపై దాడులకు పాల్పడ్డారు. వీరి దాడిలో నలుగురు టీడీపీ కార్యకర్తలు గాయపడ్డారు. అదే సమయానికి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి కుమారులు మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి కూడా వైసీపీ వర్గీయులకు మద్దతుగా గ్రామానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ వర్గీయులను పరామర్శించేందుకు వచ్చిన టీడీపీ అభ్యర్థి పులివర్తి నానీ కుమారుడు వినీల్,గ్రామస్తులు చెవిరెడ్డి కుమారులతో వాగ్వాదానికి దిగారు. కొందరు రాళ్ళతో దాడి చేశారు.దీంతో పోలీసులు అడ్డుకుని మోహిత్, హర్షిత్‌లను హుటాహుటిన వాహనాలెక్కించి గ్రామం నుంచీ వెలుపలికి పంపించేశారు. ఆ హడావిడిలో మోహిత్ గన్‌మెన్ ఈశ్వర్ గ్రామంలోనే చిక్కుకుపోవడంతో గ్రామస్తులు అతన్ని గుడిలో నిర్బంధించి మొబైల్ ఫోన్ లాక్కున్నారు. ఈలోగా దాడుల సమాచారం తెలియడంతో చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన టీడీపీ మద్దతుదారులు భారీ సంఖ్యలో కూచువారిపల్లికి చేరుకున్నారు. ఆగ్రహంతో వైసీపీ సర్పంచ్ కొటాల చంద్రశేఖర్‌రెడ్డి ఇంటిపై పడ్డారు. ఇంట్లో సమీప బంధువైన మహిళ వుండగా ఆమెను వెలుపలికి రప్పించి ఇంటిని తగులబెట్టేశారు. వైసీపీ వర్గీయులకు చెందిన రెండు కార్లను దహనం చేశారు.పులివర్తి నానీ గ్రామానికి చేరుకుని నిర్బంధంలో వున్న గన్‌మెన్ ఈశ్వర్‌ను గ్రామం నుంచీ పంపించివేశారు. గ్రామంలో వెయ్యిమందికి పైగా టీడీపీ మద్దతుదారులు మొహరించి వుండడంతో లోనికి వెళ్ళడానికి ఎవరూ సాహసించలేక పోయారు. సకాలంలో పోలీసు బలగాలు చేరుకోకపోవడంతో ఆ ప్రాంతంలో రాత్రి 8 గంటల నుంచీ అర్ధరాత్రి 12 గంటల వరకూ కూడా తీవ్ర ఉద్రిక్తత కొనసాగుతోంది.




చెవిరెడ్డి మోహిత్, పులివర్తి వినీల్ మధ్య వాగ్వాదం

ఏనుగు దాడిలో ఒకరి మృతి

పాకాల, మే 13: పాకాల మండలం చెన్నుగారిపల్లె పంచాయతీ మణిపిరెడ్డిపల్లె, పాకాల పరిసర గ్రామాల్లో అడవి ఏనుగు ఒకటి సోమవారం పట్టపగలే హల్‌చల్ చేసింది. మణిపిరెడ్డిపల్లె సమీపంలో ఎం.కాతవరాయన్ (52)పై దాడి చేయడంతో అతడు మృతి చెందాడు. మృతుడు తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై పెరియకొలపడికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. రాళ్లు కొట్టుకుంటూ జీవనం సాగిస్తున్నాడని సమాచారం. ఇతడిపై దాడిచేశాక మణిపిరెడ్డిపల్లె రైల్వేగేటు సమీపంలో పట్టాలు దాటి అడుసుపల్లె, కుందేటివారిపల్లె పరిసరాల్లో సాయంత్రం వరకు ఏనుగు సంచరించింది. దీంతో పరిసర గ్రామాల ప్రజలు భయాందోళనలో ఉన్నారు.





పాకాల మండలం మణిపిరెడ్డిపల్లె పరిసరాల్లో సంచరిస్తున్న ఏనుగు - కాతవరాయన్ మృతదేహం



గాదంకి టోల్ ప్లాజా వద్ద ఆందోళనకు దిగిన గ్రామస్తులు - గురుస్వామి మృతదేహం -

వాహనం ఢీకొని ఒకరి మృతి

గాదంకి టోల్ ప్లాజా వద్ద గ్రామస్తుల ఆందోళనతో ట్రాఫిక్ జామ్

చంద్రగిరి, మే 13: మండలంలోని అమాసవారిపల్లె వద్ద జాతీయ రహదారిలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని అదే గ్రామానికి చెందిన గురుస్వామి(60) మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు... రేణిగుంటలో నివాసం ఉంటోన్న గురుస్వామి ఓటు హక్కును వినియోగించుకోవడానికి స్వగ్రామమైన అమాసవారిపల్లెకు సోమవారం వచ్చాడు.గాదంకి టోల్ ప్లాజా వద్ద టిఫిన్ చేయడానికి రాత్రి హోటల్‌కు వస్తుండగా, దారిలో వెళుతున్న వాహనం ఒకటి గురుస్వామిని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. టోల్ ప్లాజా వద్ద లైట్లు లేకపోవడంతోనే ఈ ప్రమాదం జరిగిందని ఆగ్రహించిన గ్రామస్తులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. వాహన రాకపోకలు నిలిచిపోవడంతో సుమారు మూడు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయింది. సమాచారం అందుకున్న ఎస్‌ఐ అనిత సంఘటనా స్థలానికి వెళ్లి ప్రమాద తీరును పరిశీలించి, గ్రామస్తులకు సర్దిచెప్పి వాహన రాకపోకలకు చర్యలు తీసుకున్నారు.గురుస్వామి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు.

సమయం ముగిసినా పలు కేంద్రాల్లో పోలింగ్



ఎర్రావారిపాలెం మండలం బోడెవాండ్లపల్లిలో సాయంత్రం 6 గంటల తర్వాత కూడా పోలింగ్ జరుగుతున్న దృశ్యం

ఎర్రావారిపాలెం, మే 13: మండలంలోని పలు కేంద్రాల్లో సమయం ముగిసిన తర్వాత కూడా పోలింగ్ జరిగింది. గతంలో కంటే భిన్నంగా ఓటర్లు తమ ఓటు హక్కును అధిక సంఖ్యలో వినియోగించుకున్నారు. ఉదయం 7గంటల నుంచి ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6గంటల తర్వాత కూడా కొన్ని కేంద్రాల్లో కొనసాగింది. ఉదయమాణిక్యం, బోడెవాండ్లపల్లి 8, 9 పోలింగ్ కేంద్రాల్లో సమయం దాటినా ఓటర్లు క్యూలైన్లలో ఉండి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మండలంలో సోమవారం రాత్రి 9.30 గంటలకు అందిన సమాచారం మేరకు 80 శాతం పోలింగ్ నమోదైనట్లు రెవెన్యూ వర్గాలు తెలిపాయి.



ఎర్రావారిపాలెం మండలంలో ఉదయం 8గంటలకే క్యూలైన్‌లో బారులు తీరిన ఓటర్లు

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.25 కోట్లు

తిరుమల, మే 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.25 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం పరకామణి లెక్కింపులు నిర్వహించి, సోమవారం ఉదయం ప్రకటించింది. ఇక, ఆదివారం 80,001 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 24,307 మంది తలనీలాలు సమర్పించారు.

కలకలం రేపిన వీవీప్యాట్‌లోని చిత్రం

సోషల్ మీడియాలో హల్‌చల్



పలమనేరు, మే13 : పోలింగ్ స్టేషన్‌లో ఓటు హక్కు వినియోగించుకునే వారు మాత్రమే చూడగలిగే వీవీప్యాట్‌లో ఓటు వేసిన చిత్రం సోమవారం పలమనేరులో సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. వీవీప్యాట్‌లో ఓటు అమరనాథరెడ్డికి పోల్ చేసినట్లు సైకిల్ గుర్తుతోపాటు గ్రూప్ అడ్మిన్ మోహన్ సోషియల్ మీడియాలో పోస్టు చేశారు. సెల్‌ఫోన్లు పోలింగ్ కేంద్రంలోకి అనుమతి లేని సమయంలో ఈ చిత్రం బయటకు ఎలా వచ్చిందనేది పెద్ద చర్చనీయాంశంగా మారింది. పలమనేరు నియోజకవర్గ ఎన్నికల అధికారి మనోజ్‌రెడ్డిని వివరణ కోరగా దర్యాప్తు చేస్తున్నామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

అంబేడ్కర్‌కు అపచారం



అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళనకు దిగిన దళిత సంఘాలు

వెంకటగిరి/ డక్కిలి, మే 13 : వెంకటగిరి పట్టణ నడిబొడ్డులో ఉన్న అంబేడ్కర్ విగ్రహం తలనరికి దూరంగా విసిరేసిన ఘటన సంచలనం రేకెత్తించింది.వెంకటగిరి రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో రోడ్డుకు ఆనుకొని వున్న విగ్రహం తలనరికి దూ రంగా పడేసి ఉన్న విషయాన్ని సోమవారం తెల్లవారుజామున స్థానికులు గుర్తించారు. ఈ విషయం తెలుసుకొన్న దళిత సంఘాలు పోలీసులకు ఫిర్యాదు చేశాయి.ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు లేకపోవడంతో ఈ దారుణానికి ఒడిగట్టిందెవరన్న విషయం తేలలేదు.దీనిపై మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టాలని దళిత సంఘాల నేతలు నిర్ణయించాయి.

తుమ్మలగుంటలో ఉద్రిక్తత



దొడ్ల కరుణాకర్‌రెడ్డిని లోపలకు తీసుకెళుతున్న పోలీసు

తిరుపతి రూరల్/పాకాల, మే 13: ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి స్వగ్రామమైన తుమ్మలగుంట హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో సోమవారం సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ ప్రక్రియ ముగిశాక కొంత ఉద్రిక్తత నెలకొంది. పోలింగ్ ముగిసిన తర్వాత టీడీపీ ఏజెంట్‌గా వ్యవహరించిన దొడ్ల కరుణాకర్‌రెడ్డి పోలింగ్ బూత్ నుంచి వెలుపలకు వచ్చారు. అప్పటికే పోలింగ్ బూత్ కేంద్రం గేట్ వద్ద ఉన్న చెవిరెడ్డి సోదరుడు రఘు టీడీపీ అనుకూలంగా ఓట్లు వేయిస్తున్నారంటూ తీవ్ర ఆగ్రహంతో దొడ్లపైకి దూసుకొచ్చాడు. మాటల యుద్ధానికి దిగి.. ఒకరిపై ఒకరు దాడి చేసుకోబోయే క్రమంలో భద్రతా సిబ్బంది అడ్డుకున్నారు. రఘును బయటికి పంపి, కరుణాకర్‌రెడ్డిని తిరిగి బూత్‌లోకి పంపారు. కొద్ది నిమిషాల్లోనే రఘుతోపాటు చెవిరెడ్డి అనుచరులు భారీగా పోగయ్యారు. దొడ్ల బయటకి వస్తే దాడి చేయాలని నిలబడ్డారు. మరోవైపు టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని సొంతగ్రామమైన పులివర్తివారిపల్లెకి వెళ్లిన చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని నాని అనుచరులు అనుచరులు అడ్డుకున్నారని, మోహిత్‌కు ఏదైనా అయితే తుమ్మలగుంట నుంచి ఈవీఎంలు ఎలా బయటకి వెళతాయో చూస్తామంటూ ఆగ్రహంతో ఊగిపోయారు. పోలీసులు టీడీపీకే అనుకూలంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. ఈవీఎంల ప్రస్తావన తీసుకురాగానే భద్రతా సిబ్బంది అప్రమత్తమై అదనపు బందోబస్తును సమకూర్చుకున్నారు. భారీగా లాఠీలు, ఆయుధాలతో పోలింగ్ కేంద్రం ముందు మోహరించడంతో ఆప్రదేశమంతా భయానకంగా మారింది. కొద్ది నిమిషాల వ్యవధిలోనే దొడ్లను పోలీసులు ముందు జాగ్రత్తగా అదుపులోకి తీసుకుని అక్కడ నుంచి తీసుకెళ్లిపోయారు. మరోవైపు సీఐ అహ్మద్ స్పందిస్తూ.. మోహిత్ సురక్షితంగానే ఉన్నారని, కొద్దినిమిషాల్లో తుమ్మలగుంటకు చేరుకుంటారని తెలియజేసి, రఘుతోపాటు అక్కడున్న చెవిరెడ్డి అనుచరులను పోలింగ్ కేంద్రం నుంచి దూరంగా పంపేశారు. అయినప్పటికీ గ్రామస్తుల చేతుల్లో కర్రలు, రాళ్లు ఉండటంతో కట్టుదిట్టమైన భద్రత నడుమ ఈవీఎంలను బస్సుల్లో ఎక్కించి పంపారు. దాంతో రాత్రి 8 గంటల తర్వాత తుమ్మలగుంటలో ప్రశాంత వాతావరణం నెలకొంది.

పులివర్తివారిపల్లెలో ఏం జరిగిందంటే..

పాకాల మండలం పులివర్తివారి పల్లెలో పోలింగ్ పూర్తయ్యాక వైసీపీ ఏజెంట్‌గా ఉన్న అనిల్ అనే వ్యక్తిపై దాడి జరిగిందన్న సమాచారంతో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి వచ్చారు. దాంతో మండపంలోని వైసీపీ కార్యకర్తలందరూ అక్కడికి చేరుకున్నారు. ఈ క్రమంలో టీడీపీ, వైసీపీ శ్రేణులు ఒకరిపై ఒకరు మాటల యుద్ధం చేసుకున్నారు. వెంటనే అక్కడ విధుల్లో ఉన్న పోలీసులు చేరుకుని, ఇరువర్గాలను పోలింగ్ కేంద్రం వద్ద నుంచి పంపేశారు.



అనిల్‌ని పరామర్శిస్తున్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

కూచువారిపల్లిలో టెన్షన్... టెన్షన్









చంద్రగిరి మండలం కూచువారిపల్లిలో సోమవారం రాత్రి వైసీపీ శ్రేణుల దాడిలో గాయపడ్డ టీడీపీ నాయకుడు మురళీధర్, మోహన్ - గాయపడ్డ మహిళను ఆస్పత్రికి తీసుకెళ్తున్న గ్రామస్తులు -టీడీపీ శ్రేణులను పరామర్శిస్తున్న పులివర్తి వినీల్

చంద్రగిరిలో 79.34 శాతం పోలింగ్

చంద్రగిరి, మే 13: మండలంలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ 79.34 శాతం నమోదైనట్లు సమాచారం. ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా అప్పటికే ఓటర్లు పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. చంద్రగిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో మాజీ మంత్రి గల్లా అరుణకుమారి,ఎ.రంగంపేట ఉన్నత పాఠశాలలో సినీనటుడు ఎంబీయూ ఛాన్సలర్ డాక్టర్ మోహన్‌బాబు, మా అధ్యక్షుడు మంచు విష్ణు ఓటు హక్కును వినియోగించుకొన్నారు.పాకాల మండలం పులివర్తి వారిపల్లెలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పులివర్తి నాని, సుధారెడ్డి దంపతులు, అలాగే ఆయన కుమారుడు వినీల్ దంపతులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. చిత్తూరు పార్లమెంటు టీడీపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు చంద్రగిరిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. శేషాపురం పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ, వైసీపీ మధ్య స్వల్పఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు అక్కడికి చేరుకుని ఇరువర్గాలను పోలింగ్ కేంద్రం నుంచి పంపించేశారు. కాశిపెంట్ల కేంద్రంలో పోలింగ్ సమయం ముగిసినా, ఈవీఎంలు తరలించడానికి వైసీపీ ఏజెంట్ మహేష్ సంతకం పెట్టకపోవడంతో రాత్రి 9.30 గంటలు అయినా ఈవీఎంలు తరలించలేదు.చంద్రగిరి పట్టణంలోని జేఆర్‌కేఆర్ పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. చిన్నరామాపురంలో దొంగ ఓటు వేయడానికి వచ్చిన వ్యక్తిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. దీంతో వైసీపీ, టీడీపీ మధ్య ఘర్షణ చోటు చేసుకోవడంతో రాత్రి 9.30 గంటల వరకు ఈవీఎంలు తరలించలేదు. వైసీపీ ఏజెంట్లు ఈవీఎంలు తరలించడానికి సంతకాలు చేయలేదు. రీపోలింగ్ కావాలని పట్టుబట్టారు.



పాకాల మండలం పులివర్తివారిపల్లె పోలింగ్ బూత్‌లో ఓటు వేసిన టీడీపీ అభ్యర్థి పులివర్తి నాని, కుటుంబసభ్యులు



చంద్రగిరి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాదరావు



కొటాలలో వృద్ధురాలిని ఓటు కోసం తీసుకొస్తున్న యువకులు







చంద్రగిరి బాలికల ఉన్నత పాఠశాలలో కాంగ్రెస్ అభ్యర్థి కేపీ వాసు ఓటింగ్ - తుమ్మలగుంటలో ఓటు వేసిన వైసీపీ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి - చంద్రగిరి బాలుర ఉన్నత పాఠశాలలో ఓటు వేసిన మాజీ మంత్రి గల్లా అరుణకుమారి



చంద్రగిరిలో బారులు తీరిన ఓటర్లు

ఈవీఎంల మొరాయింపు

తిరుచానూరు/ రామచంద్రాపురం/ భాకరాపేట/ మంగళం/ పాకాల/ తిరుపతి రూరల్/ చంద్రగిరి, మే 13: పలు చోట్ల ఈవీఎంల మొరాయింపుతో ఓటర్లు ఇబ్బంది పడ్డారు.

- తిరుచానూరు జడ్పీ హైస్కూల్‌లో కొంతసేపు అంతరాయం కల్గింది.
- పద్మావతిపురంలో గంటపాటు పోలింగ్ ఆలస్యమైంది. మిట్టమీద కండ్రిగలోనూ ఇదే పరిస్థితి.
- మంగళం క్వార్టర్స్ జడ్పీ స్కూల్‌లో, బీటీఆర్‌కాలనీ సచివాలయంలోనూ 20 నిమిషాలు ఆలస్యమైంది.
- పాకాల మండలానికి వచ్చేసరికి దామలచెరువు పంచాయతీ కుక్కలపల్లి పోలింగ్ కేంద్రంలో గంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది.
- చిన్నగొట్టిగల్లు మండలం దీన్‌దార్‌పల్లె పంచాయతీలోని శెట్టిపల్లెలోనూ కాసేపు పోలింగ్‌కు అంతరాయం ఏర్పడింది.
- ఆర్సీపురం మండలంలోని కమ్మకండ్రిగ పోలింగ్ కేంద్రంలో ఉదయం 7 నుంచి 8గంటల వరకు ఈవీఎం మొరాయించింది. అలాగే మధ్యాహ్నం రెండు దఫాలు మొరాయించడంతో అధికారులు కొత్త ఈవీఎం తెప్పించి పోలింగ్ నిర్వహించారు. అలాగే నెత్తకుప్పం, నెన్నూరు వద్ద ఈవీఎంలుఉదయం 20 నిమిషాలపాటు మొరాయించాయి. ఓటర్లు అధికంగా ఉండటతో రాయలచెరువు, వేపకుప్పం వద్ద రాత్రి తొమ్మిది గంటల వరకు పోలింగ్ జరిగింది.





పాకాల మండలం సామిరెడ్డిపల్లెలో ఉదయం 6.30 గంటలకే భారీ సంఖ్యలో వున్న ఓటర్లు- సాయంత్రం 6 గంటలు దాటినా ఫకీరుపేట పోలింగ్ బూత్‌లో క్యూలైన్‌లో వున్న ఓటర్లు

ఇరుకుగదిలో ఓటర్లకు ఇబ్బందులు

- ఇష్టానుసారంగా పోలింగ్ కేంద్రాలను విభజించడంతో చాలాచోట్ల ఓటర్లు ఇబ్బంది పడ్డారు. తిరుపతి రూరల్, ఆర్సీపురం, చంద్రగిరి మండలాల్లో గ్రామ శివారు కాలనీల్లోకి పోలింగ్ కేంద్రాలను తరలించడంతో ఓటర్లకు ఇక్కట్లు తప్పలేదు.
- పాకాల మండలం మొగరాల పంచాయతీ నేలదానిపల్లె పోలింగ్ కేంద్రంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో గంట ఆలస్యంగా పోలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది.
- పాకాల మండలానికి వచ్చే సరికి పెద్దరామాపురం, రామిరెడ్డివారి పల్లె, ఊట్లవారిపల్లె, ఫకీరుపేట పోలింగు కేంద్రాల వద్ద గొడవలు జరిగాయి.
- తిరుచానూరు జడ్పీ హైస్కూల్ పోలింగ్ కేంద్రంలో ఏఎస్డీ జాబితా ఏజెంట్లకు ఇవ్వకుండా పోలింగ్ అధికారులు దాచిపెట్టారని టీడీపీ నాయకురాలు పులివర్తి సుధారెడ్డి ఆరోపించారు. దీనిపై ఎన్నికల కమిషన్‌కి ఫిర్యాదు చేస్తామని తెలిపారు.



పాకాలలో ఓటు వేసిన 96 ఏళ్ల వృద్ధురాలు శారదమ్మ

మంగళం పరిధిలో వాగ్వాదాలు

- మంగళం పరిధిలోని సప్తగిరికాలనీ పంచాయతీ, రణధీరపురం పంచాయతీల్లో వైసీపీ, టీడీపీ నాయకుల మధ్య వాగ్వాదాలు జరిగాయి. పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలను చెదరగొట్టారు.
- మంగళం క్వార్టర్స్, రణధీరపురం పంచాయతీ బూత్‌ల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్లు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా సాగింది. తాగునీరు కూడా కొన్ని చోట్ల ఏర్పాటు చేయకపోవడంతో ఓటర్లు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.
- తిరుపతి రూరల్ మండంలోని పేరూరులో రెండు కేంద్రాల వద్ద కొందరు ఓటర్లు అడ్డదారిన ప్రవేశించడంతో క్యూలో నిలబడి ఉన్న ఓటర్లు.. పోలీసులు అధికారులతో కొంతసేపు వాగ్వాదానికి దిగారు.
- తిరుపతి రూరల్ మండలం పద్మావతీపురంలో దొంగ ఓట్లు వేయడానికి వచ్చిన యువకులను టీడీపీ నేతలు పట్టుకుని పోలీసులకు అప్పగించారు.శ్రీనివాసపురంలో సుమారు 500 దొంగ ఎపిక్‌కార్డులను టీడీపీ నేతలు స్వాధీనం చేసుకున్నారు. అయితే తమకు సంబంధం లేదని కొరియర్ బాయ్ అక్కడ ఉంచి వెళ్లాడని వైసీపీ నేతలు బుకాయించారు.
- చంద్రగిరి శేషాపురం పోలింగ్‌కేంద్రం వద్ద టీడీపీ, వైసీపీ కార్యకర్తలు తీవ్రస్థాయిలో గొడవపడ్డారు. అక్కడ పోలీసులు సర్దిచెప్పారు. చెవిరెడ్డి కుమారుడు హర్షిత్‌రెడ్డి అక్కడికి రావడంతో కాసేపు గందరగోళం నెలకొంది.

దొంగ ఓట్లను అడ్డుకున్నారని..

టీడీపీ నేతలపై వైసీపీ శ్రేణుల దాడి

పుంగనూరు, మే 13: దొంగ ఓట్లను అడ్డుకున్నారనే కోపంతో పోలింగ్ అనంతరం తెలుగుదేశం పార్టీ నేతలపై వైసీపీ శ్రేణులు దాడులకు తెగబడ్డాయి. ఎంపీడీవో కార్యాలయం, తాటిమాకులపాళ్యం పోలింగ్ కేంద్రాల్లో టీడీపీ ఏజెంట్లు దొంగ ఓట్లకు అనుమతించకపోవడంతో వైసీపీ నాయకులు వాగ్వాదానికి దిగారు. వైసీపీకి ఓట్లు వేయాలని కౌన్సిలర్ నటరాజ ప్రచారం చేస్తుండటంతో టీడీపీ మాజీ కౌన్సిలర్ దేశాది ప్రకాశ్ అడుకున్నారు. వీరి మధ్య గొడవ జరిగింది. తాటిమాకులపాళ్యం పోలింగ్ కేంద్రంలో ప్రకాశ్ ఓటు వేయడానికి వెళ్లగా వైసీపీ శ్రేణులు దుర్భాషలాడాయి. అదే సమయంలో తన ఓటు అడ్డుకున్నారని వైసీపీకి చెందిన బండ కుమార్ గొడవకు దిగారు. పోలింగ్ అనంతరం వారి వారి ఇళ్లకు వెళ్లారు. ఈ క్రమంలో తాటిమాకులపాళ్యంలో దేశాది ప్రకాశ్ ఇంటిపై వైసీపీ కౌన్సిలర్ నటరాజ, పార్టీ కార్యకర్తలు బండ కుమార్, సాగర్, సునీల్ తదితరులు రాళ్లు, కర్రలతో ఇంటి వద్దకు వచ్చి దుర్భాషలాడుతూ దాడి చేయడానికి ప్రయత్నించారు. దేశాది ప్రకాశ్ ఫిర్యాదు చేయడంతో ఏఎస్పీ సుబ్బరాజు ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వారిని అక్కడ నుంచి పంపించేశారు. అలాగే స్థానిక కొత్తయిండ్లు పోలింగ్ కేంద్రంలో దొంగ ఓట్లు అనుమతించలేదని టీడీపీ ఏజెంట్లు నరేశ్‌రాయల్, రమేశ్‌లను కొట్టాలని అధిక సంఖ్యలో పోలింగ్ కేంద్రం వద్దకు వైసీపీ శ్రేణులు వచ్చాయి. దీంతో పోలింగ్ ముగిసినా వారు పోలీసులకు సమాచారం ఇచ్చి అక్కడే ఉన్నారు. ఈ క్రమంలో నరేశ్‌రాయల్, రమేశ్‌లను ఏఎస్పీ సుబ్బరాజు తన వాహనంలో ఇళ్లకు పంపారు.

'స్టేటస్'లో మాక్‌పోలింగ్ ఫొటో

- వైసీపీ సర్పంచిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

రామకుప్పం, మే 13: రామకుప్పం మండలం ముద్దనపల్లె పోలింగ్ బూత్‌లో మాక్ పోలింగ్ ఫొటోను తీసి వైసీపీకి చెందిన సర్పంచు సికిందర్ తన వాట్సాప్ స్టేటస్‌లో పెట్టారు. వాట్సాప్ స్టేటస్‌ను స్థానికులు స్క్రీన్‌షాట్ తీసి పోలీసులకు పంపారు. దీనిపై స్పందించిన పోలీసులు సికిందర్‌ను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు.



గంగమ్మను దర్శించుకున్న జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు

నేడు గంగమ్మ జాతర చాటింపు

ఎన్నికల కారణంగా ఆలస్యం

తిరుపతి(కల్చరల్), మే 13: తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల కారణంగా వాయిదా పడిన విషయం తెలిసిందే. వాస్తవానికి ఈనెల14వ తేదీతో జాతర ముగియాల్సి ఉంది. కానీ ఎన్నికల కారణంగా ఆలస్యంగా మంగళవారం జాతరకు చాటింపు వేయనున్నారు. అనంతరం భక్తులు సంప్రదాయంగా వచ్చే వేషధారణలతో ప్రదర్శనగా ఆలయం చేరుకుని, అమ్మవారికి మొక్కులు తీర్చుకుంటారు. ఇందులో భాగంగా.. బుధవారం బైరాగి వేషం, గురువారం బండవేషం, శుక్రవారం తోటి వేషం, శనివారం దొరవేషం, ఆదివారం మాతంగి వేషం, సోమవారం సున్నపు కుండల వేషం వేస్తారు. 21వ తేదీ మంగళవారం అమ్మవారి జాతర జరుగుతుంది. అదే రోజు అర్ధరాత్రి అంటే 22వ తేదీ వేకువ జామున విశ్వరూప దర్శనం ఉంటుంది. ఏటా అమ్మవారి జాతరకు దేశ, విదేశాల భక్తులు పాల్గొనడం ఆనవాయితీ. ఈదఫా జాతర ఆలస్యంగా జరుగుతున్న నేపథ్యంలో బయటి ప్రాంతాల భక్తులు ఏమేరకు వస్తారో చూడాల్సి ఉంది.

గత ఎన్నికల కంటే తగ్గిన జిల్లా పోలింగ్ శాతం

తిరుపతి, మే 13 (ఆంధ్రజ్యోతి): 2019 ఎన్నికలతో పోలిస్తే జిల్లాలో పోలింగ్ శాతం తగ్గింది. సోమవారం రాత్రి 10.30 గంటల వరకూ నమోదైన శాతాన్ని పరిగణనలోకి తీసుకుంటే నియోజకవర్గాల వారీగా కూడా వెంకటగిరి, గూడూరు, సూళ్లూరుపేట, సత్యవేడు, శ్రీకాళహస్తి, తిరుపతి తదితర ఆరు నియోజకవర్గాల్లో గతాని కంటే ఈ పర్యాయం పోలింగ్ శాతం తగ్గింది. అయితే కేవలం చంద్రగిరిలో మాత్రమే స్వల్పంగా 0.14 శాతం మాత్రమే పెరిగింది.

పోలింగ్ శాతం

నియోజకవర్గం	2019	2024
వెంకటగిరి	79.36	79.96
గూడూరు	77.88	76.30
సూళ్లూరుపేట	83.27	80.12
సత్యవేడు	86.82	82.94
శ్రీకాళహస్తి	82.43	79.03
చంద్రగిరి	78.10	78.24
తిరుపతి	66.61	62.56
మొత్తం	78.768	76.51

జిల్లాలో రీ పోలింగ్ అవకాశాలు దాదాపు లేనట్టే!

ఎక్కడా ఫిర్యాదులు అందని వైనం

గత ఎన్నికల్లో ఏడు కేంద్రాల్లో జరిగిన రీపోలింగ్

తిరుపతి, మే 13 (ఆంధ్రజ్యోతి): సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా ఎక్కడా రీపోలింగ్ అవసరమయ్యే పరిస్థితి కనిపించడం లేదు. అధికారికంగా కూడా ఎక్కడా పోలింగ్ కేంద్రాలకు చెందిన ప్రిసైడింగ్ అధికారుల నుంచి ఫిర్యాదులు అందలేదని సమాచారం. అదే సమయంలో రాజకీయ పార్టీల నేతలు, అభ్యర్థుల నుంచి కూడా ఫిర్యాదులు అందలేదు. దీంతో రీపోలింగ్ అవసరం ఏర్పడక పోవచ్చునని అధికార యంత్రాంగం అంచనా వేస్తోంది. అయితే ఒకటి, రెండ్రోజుల తర్వాత కూడా ఫిర్యాదులు అందే అవకాశాల్లేక పోలేదు. ఎందుకంటే గత ఎన్నికల్లో చంద్రగిరి నియోజకవర్గంలో ఏడు పోలింగ్‌కేంద్రాల్లో రీపోలింగ్ జరిగింది. అప్పట్లో పోలింగ్ జరిగిన నెల తర్వాత ఎన్నికల కమిషన్ రీపోలింగ్‌కు ఆదేశించింది. పాకాల మండలం 104వ బూత్ పులివర్తివారిపల్లె, రామచంద్రాపురం మండలం 310వ బూత్ కాలేపల్లె, 313వ బూత్ వెంకట్రామాపురం, 316వ బూత్ కొత్తకండ్రిగ, 318వ బూత్ కమ్మపల్లె, 321వ బూత్ ఎన్‌ఆర్ కమ్మపల్లె, 323వ బూత్ కుప్పం బాదూరులలో రీ పోలింగ్ జరిగింది. ప్రస్తుతానికైతే ఎవరి నుంచి ఫిర్యాదులు లేని కారణంగా రీపోలింగ్ అవసరమయ్యే పరిస్థితులు లేవని అంచనా వేస్తున్నారు.

22న తిరుమలలో వెంగమాంబ జయంతి ఉత్సవాలు

తిరుమల, మే 13 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి అపర భక్తురాలు, భక్తకవయిత్రి మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ 294వ జయంతి ఉత్సవాలు ఈ నెల 22వ తేదీన తిరుమలలో వైభవంగా జరుగుతాయి. వెంగమాంబ స్వస్థలమైన తరిగొండ, తిరుమల, తిరుపతి దివ్యక్షేత్రాల్లో జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నారు. 22న సాయంత్రం 4.30 గంటలకు తిరుమలలోని వెంగమాంబ బృందావనంలో పుష్పాంజలి సమర్పిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు తిరుమల నారాయణగిరి ఉద్యానవనంలోని పద్మావతి పరిణయోత్సవ మండపానికి ఉభయ నాంచారీ సమేతంగా శ్రీవారు ఊరేగింపుగా వచ్చి వేంచేస్తారు. సాయంత్రం 6 నుంచి 7 గంటల వరకు అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారులు తరిగొండ వెంగమాంబ సంకీర్తనల గోష్ఠిగానం నిర్వహిస్తారు. రాత్రి 7 గంటలకు విశాఖ శారద పీఠాధిపతి స్వరూపానందేంద్ర స్వామి అనుగ్రహభాషణం చేయనున్నారు.

ఎస్పీ ఆఫీసు ముందు వృద్ధుడి మృతి



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 13: ఎస్పీ ఆఫీసు ముందు సోమవారం సుమారు 80 ఏళ్ల వయసు గల వృద్ధుడు మృతి చెందాడు. చర్మవ్యాధి వల్ల శరీరం గాయాలుగా కన్పిస్తూ.. చీమలు పాకుతూ కన్పించాయి. సోమవారం మధ్యాహ్నం ఈ విషయం మీడియా దృష్టికి వచ్చింది. పోలీసులు స్పందించి అంబులెన్స్ తెప్పించారు. శవాన్ని రుయా మార్చురీకి తరలించారు. తెల్ల చొక్కా, ఎర్ర పంచె ధరించి ఉన్నాడని, ఆచూకీ తెలిసిన వారు పోలీసులను కానీ, రుయా మార్చురీలో కానీ సంప్రదించవచ్చు.





తిరుపతి సెవన్ హిల్స్ స్కూలు వద్ద ఈవీఎంలు మొరాయించడంతో బారులు తీరిన ఓటర్లు - బైరాగిపట్టెడలోని ఎంజీఎం స్కూల్‌లో బారులు తీరిన ఓటర్లు

దొంగ ఓట్లు, ఘర్షణల నడుమ ముగిసిన ఎన్నికలు

పలుచోట్ల ఈవీఎంల మొరాయింపు

గంటల తరబడి ఓటర్ల ఎదురుచూపులు



ఆరణి శ్రీనివాసులుతో కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ

తిరుపతి, మే 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నియోజకవర్గంలో మరోసారి దొంగ ఓట్లు, ఘర్షణల నడుమ కేంద్ర బలగాల పహారాలో ఆదివారం సార్వత్రిక ఎన్నికలు ముగిశాయి. నియోజకవర్గ పరిధిలోని 274 పోలింగ్ బూత్‌ల్లో ఉదయం ఆరు గంటలకే ఓటర్లు బారులు తీరారు. ఎండకు ముందే ఓటేద్దామన్న ఆలోచనతో రావడంతో పోలింగ్ తొలిగంటలోనే కేంద్రాలవద్ద హడావుడి నెలకొంది. మహిళలు, యువత పెద్దఎత్తున పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవడం కనిపించింది. పలుచోట్ల ఈవీఎంలు మొరాయించడంతో ఒక్కో ఓటు వేసేందుకు సగటున నాలుగు నిమిషాలు సమయం పట్టింది. దీంతో మందకొడిగా పోలింగ్ కొనసాగడంతో కేంద్రాల వద్ద ఓటర్లు రెండు, మూడు గంటల పాటు క్యూలైన్లలో వేచివుండాల్సి వచ్చింది. సీనియర్ సిటిజన్లు ఎక్కువ సమయం క్యూలైన్లలో ఉండలేక పలువురు వెనుతిరగాల్సి వచ్చింది. అక్కడక్కడా వైసీపీ దొంగ ఓటర్లను పంపడంతో కూటమి నేతలు అడ్డుకొని పోలీసులకు అప్పగించారు. ఈక్రమంలో వాగ్వాదాలు, తోపులాటలు, స్వల్ప ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి.

- తిమ్మినాయుడుపాలెంలో ఉదయం 7 గంటలకు టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి కుటుంబ సమేతంగా ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇక్కడ ఈవీఎంలు మొరాయించడంతో 20 నిమిషాలు ఆలస్యంగా ఓటింగ్ ప్రక్రియ మొదలైంది. మధురానగర్‌లో 45 నిమిషాల ఆలస్యంగా మొదలైంది.

● భూమనపై చర్యలకు సీఈవోకు సీపీఐ నారాయణ లేఖ

ఆంధ్రజ్యోతి ప్రతినిధులను అసభ్య పదజాలంతో దూషించిన ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డిపై చర్యలు తీసుకోవాలని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ ఎన్నికల సంఘానికి లేఖ రాశారు. ఆయనను నియంత్రణ చేయాల్సిన అవసరం ఉందన్నారు.

● ఓటెత్తిన దివ్యాంగులు, వృద్ధులు

దివ్యాంగులు, వృద్ధులు పోలింగ్ బూత్‌ల వద్దకు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆరోగ్యం సహకరించకపోయినా పలువురు వీల్‌ఛైర్‌ను ఆసరా చేసుకుని కేంద్రాలకు రావడం కనిపించింది.

- తిరుపతిలోని జగన్మాత చర్చి వద్ద ఉన్న పోలింగ్ బూత్‌లో కుటుంబీకులతో కలిసి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చింతా మోహన్ తన ఓటు హక్కు వినియోగించుకున్నారు.

ప్రలోభాలకు గురి చేసిన వైసీపీ

తిరుపతి(వైద్యం): రామానుజ సర్కిల్ సమీపంలోని 133, 134 పోలింగ్ కేంద్రాల ముందే వైసీపీ శ్రేణులు గుంపులుగా చేరారు. ఓటర్లను ప్రలోభాలకు గురిచేశారు. ఇక్కడ బందోబస్తుగా తక్కువ మంది పోలీసులను నియమించడంతో వైసీపీ శ్రేణులు నేరుగా కేంద్రాల్లోకి వెళ్లి వచ్చేందుకు అవకాశం ఏర్పడింది.

- గొల్లవానిగుంటలోని పోలింగ్ కేంద్రంలో కేవలం ఒక్క కానిస్టేబుల్‌ను మాత్రమే నియమించడంతో భోజన సమయంలో ఆయన విధులను ఓ యువకుడు చేయాల్సిన పరిస్థితి నెలకొంది.



ఓటు హక్కు వినియోగించుకున్న వైసీపీ, సీపీఐ ఎమ్మెల్యే అభ్యర్థులు అభినయ్‌రెడ్డి, మురళి





జీవకోనలో జడ్పీ హైస్కూల్ పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ అభివాదం - ఓటేశాక యువతుల ఆనందం



పోలింగ్ కేంద్రంలోకి మొబైల్ తీసుకెళ్లిన వ్యక్తిపై కేసు నమోదు

తిరుపతి(నేరవిభాగం): పోలింగ్ కేంద్రంలోకి మొబైల్ ఫోన్ తీసుకెళ్లి.. సెల్ఫీ వీడియో తీసి హల్‌చల్ చేసిన ఘటనలో ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశారు. తిరుపతి ఈస్ట్ సీఐ తెలిపిన వివరాల మేరకు.. నగరానికి చెందిన బాలసుబ్రమ్మణ్యం ఎస్టీవీనగర్ అంబేడ్కర్ మున్సిపల్ స్కూల్ కేంద్రంలో ఓటు వేసి, ఆ వీడియోను సోషల్ మీడియాలో పెట్టి, హల్‌చల్ చేశాడు. దీనిపై పోలింగ్ కేంద్రం ప్రిసైడింగ్ అధికారి సురేంద్ర ఫిర్యాదుతో బాలసుబ్రహ్మణ్యంపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

తిరుపతిలో దొంగ ఓటర్ల హల్‌చల్

ఐదుగురిపై కేసులు నమోదు - పలు పోలింగ్ బూత్‌ల వద్ద వైసీపీ కార్యకర్తల వీరంగం

శివజ్యోతి నగర్ బూత్‌లో లాఠీకి పనిచెప్పిన పోలీసులు

తిరుపతి(నేరవిభాగం), మే 13: తిరుపతిలోని పలు పోలింగ్ కేంద్రాల్లో దొంగ ఓటర్లు హల్‌చల్ చేశారు. దాదాపు 12 పోలింగ్ కేంద్రాల్లో ఫేక్ ఐడీ ఓటరు కార్డులతో ఓటు వేయడానికి వచ్చిన వారిని ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు గుర్తించి పోలీసులకు పట్టిచ్చారు. ఈ ఘటనలో పోలీసులు తిరుపతి ఈస్ట్, వెస్ట్, ఎస్వీయూ స్టేషన్ల పరిధిలో ఐదుగురిపై కేసులు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. జగన్మాత చర్చి, లిటిల్ ఏంజెల్స్ స్కూలు, శివజ్యోతి నగర్, రాయల్ నగర్ తదితర ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాలకు వచ్చిన చెన్నై, కర్నూలు, రేణిగుంట ప్రాంతాల నుంచి దొంగ ఓటర్లు రాగా, పోలీసులకు పట్టిచ్చారు. శివజ్యోతి నగర్ కేంద్రం వద్ద కార్పొరేటర్ అనీష్‌రాయల్ దొంగ ఓట్లు వేయడానికి తన అనుచరులతో రావడంతో అక్కడ టీడీపీ, వైసీపీ కార్యకర్తలు బాహాబాహీకి దిగారు. వెంటనే అక్కడికి స్ట్రైకింగ్ ఫోర్సు చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. కాసేపు అనీష్‌రాయల్‌ను అదుపులోకి తీసుకుని విడిచిపెట్టారు. సాయంత్రం పోలింగ్ ముగిసే సమయంలో శివజ్యోతి నగర్‌లో దొంగ ఓట్లు వేయడానికి బూత్‌లోకి కొందరు కార్యకర్తలు చొచ్చుకుని రావడంతో పోలీసులు లాఠీకి పనిచెప్పారు. అలాగే 13వ వార్డు గోవిందరాజస్వామి కాలేజీ వద్ద వైసీపీ నాయకులు భారీగా దొంగ ఓట్లు వేయడానికి వచ్చిన వారిని కూటమి నాయకులు కిరణ్ రాయల్, నరసింహయాదవ్ అడ్డుకున్నారు. దీంతో అక్కడ కూటమి నాయకులు, పోలీసులకు మధ్య కొంత వాగ్వాదం చోటు చేసుకుంది. పలు పోలింగ్ కేంద్రాల వద్ద వైసీపీ నేతల దౌర్జన్యాలు కొనసాగాయి.



దొంగ ఓటరును విచారిస్తున్న జనసేన ఎమ్మెల్యే అభ్యర్థి ఆరణి శ్రీనివాసులు, బీజేపీ నేత భానుప్రకాష్‌రెడ్డి

అరెస్టయిన వారి వివరాలిలా..

అరెస్టయిన వారిలో రేణిగుంట గుత్తివారిపల్లికి చెందిన నరేష్, పాంచాలిగనర్‌కు చెందిన భరత్ కుమార్, పి.శ్రీనివాసులు, భువన, భాస్కర ఉన్నారు. వీరిపై విచారణ జరుపుతున్నట్లు సెబ్ అదనపు ఎస్పీ రాజేంద్ర చెప్పారు.



జగన్మాత హైస్కూల్ పోలింగ్ బూత్ వద్ద దొంగ ఓటర్లపై ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేత నరసింహయాదవ్

దొంగ ఓటర్లకు 'సీఆర్‌పీఎఫ్' దేహశుద్ధి

ఈస్ట్ పోలీసుల అదుపులో నిందితులు

తిరుపతి దొడ్డాపురం వీధిలో దొంగ ఓట్లు వేయడానికి వచ్చిన ఇద్దరు వైసీపీ కార్యకర్తలను గుర్తించి, వారికి సీఆర్‌పీఎఫ్ సిబ్బంది దేహశుద్ధి చేశారు. సోమవారం సాయంత్రం పోలింగ్ ముగిసే సమయంలో అడ్డదారుల్లో వచ్చిన ఇద్దరు వైసీపీ యువకులు ఫేక్ ఐడీ కార్డులు తీసుకుని దొడ్డాపురం వీధిలోని పోలింగ్ కేంద్రంలోకి వెళ్లారు. టీడీపీ శ్రేణులు వీరిని సీఆర్‌పీఎఫ్ సిబ్బందికి పట్టిచ్చారు. యువకులను విచారించగా, వారి వద్ద ఫేక్ ఐడీ ఓటరు కార్డులున్నట్లు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని, యువకులిద్దరికీ కేంద్రం వెలుపలకు తీసుకొచ్చి లాఠీకి పనిచెప్పారు. లాఠీ దెబ్బలకు సొమ్మసిల్లిన యువకులకు మళ్లీ వారే నీళ్లు తాగించి, పోలీసులకు అప్పగించారు. వీరిని ఈస్ట్ పోలీసులు విచారిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.



ఎస్జీఎస్ ఆర్ట్స్ కాలేజీ వద్ద కిరణ్ రాయల్, రాజారెడ్డి, నరసింహయాదవ్

రాయల్‌నగర్‌లో వాగ్వాదం

తిరుపతి(ఆటోనగర్), మే 13: రాయల్‌నగర్‌లోని 252, 253 పోలింగ్ కేంద్రాల వద్ద అధికార పార్టీకి చెందిన శేఖర్‌రెడ్డి, నీలం బాలాజీలు దొంగ ఓటర్లను పంపుతున్నారని టీడీపీ నాయకులు రవినాయుడు తన అనుచరులతో అభ్యంతరం వ్యక్తంచేశారు. దీంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగింది. పోలీసు అధికారులు అక్కడకు చేరుకోవడంతో వివాదం సద్దుమణిగింది.

- సాయంత్రం 4 గంటల సమయంలో ఎస్‌జీఎస్ కాలేజ్ రోడ్డులో వైసీపీ, టీడీపీ శ్రేణుల మధ్య దొంగ ఓటర్లను పంపుతున్నారని వాగ్వాదం జరిగింది. పెట్రోలింగ్ పోలీసులు అక్కడకు చేరుకొని ఇరువర్గాలను చెదరగొట్టారు.

తిరుమలలో ప్రశాంతంగా పోలింగ్

తిరుమల, మే 13 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 5,347 ఓట్లకుగాను 3,510 ఓట్లు పోల్ అయ్యాయి. బాలాజీనగర్, ఆర్బీ సెంటర్, క్వార్టర్స్‌లో ఉండే ఉద్యోగులు తరలివచ్చారు. విదేశాల్లో ఉద్యోగాలు చేస్తున్న యువత కూడా ఓట్లు వేసేందుకు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చుచేసుకుని తిరుమలకు రావడం విశేషం. ప్రత్యేకించి ఆస్ట్రేలియాలో మార్కెటింగ్ విభాగంలో పనిచేస్తున్న జశ్వంత్ అనే యువకుడు ఓటు వేసేందుకే తిరుమలకు వచ్చారు. శ్రీవారి ఆలయ మాజీ ప్రధాన అర్చకుడు రమణ దీక్షితులు, ఆలయ సిబ్బంది, అర్చకులు, పరిచారకులు కూడా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం పోలింగ్ పూర్తయ్యే సమయానికి 65.63 శాతం పోలింగ్ నమోదైంది. ఈవీఎంలను అత్యంత భద్రత నడుమ తిరుమల నుంచి తిరుపతికి తరలించారు. మరోవైపు పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ నేతలు నిబంధనలను తుంగలో తొక్కారు. ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలంటూ ఓటర్లను ప్రలోభపెట్టారు. కొందరైతే వేరేవాళ్లకు ఓటేస్తే దేవుడు కూడా మనల్ని వదిలేస్తాడు అంటూ ఎమోషనల్ బ్లాక్‌మెయిల్ చేశారు. వైసీపీ కార్యకర్తలు ప్రచారం చేస్తున్నప్పటికీ పోలీసులు చూసీచూడనట్టు వ్యవహరించడం విమర్శలకు దారితీసింది.



ఓటు వేసి వస్తున్న రమణ దీక్షితులు - ఆస్ట్రేలియా నుంచి వచ్చి ఓటేసిన జశ్వంత్ - ఓటు వేసిన జపాలి ఆంజనేయస్వామి ఆలయ పూజారి పరమేశ్వర్‌దాస్

ఓటేసిన పద్మశ్రీ ఇనాక్



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), మే 13: ఎస్వీయూనివర్సిటీ మాజీ వీసీ, రచయిత, పద్మశ్రీ కొలకలూరి ఇనాక్ తిరుపతిలో ఓటు వేశారు. 85 ఏళ్ల వయసులో హైదరాబాదు నుంచి ప్రత్యేకంగా ఓటు వేయడం కోసమే తిరుపతికి వచ్చారు. పద్మావతి మహిళా యూనివర్సిటీలోని పోలింగ్ బూత్ నెంబరు-263లో ఆచార్య ఇనాక్ ఓటు వేశారు. ఆయన వెంట కుమార్తె ద్రవిడ యూనివర్సిటీ వీసీ ఆచార్య కొలకలూరి మధుజ్యోతి, తనయుడు, ఎస్వీయూనివర్సిటీ పాలకమండలి సభ్యులు ప్రొఫెసర్ కొలకలూరి సుమకిరణ్ ఉన్నారు.



గూడూరులో ఓటేసిన బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాద రావు కుటుంబీకులు, ఏర్పేడు మండలం మన్నసముద్రంలో వైసీపీ ఎంపీ అభ్యర్థి గురుమూర్తి దంపతులు

ఓటేసిన కలెక్టర్, జేసీ



ఓటేస్తున్న కలెక్టర్ షన్మోహన్ - ఓటేసేందుకు క్యూలో నిలుచున్న జేసీ శ్రీనివాసులు

చిత్తూరు కలెక్టరేట్, మే 13: జిల్లా ఉన్నతాధికారులు సోమవారం తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ మధ్యాహ్నం కలెక్టర్ బంగ్లా పక్కనున్న బాపు బాలభవన్‌లోని 44వ పోలింగ్ స్టేషన్‌లో క్యూలో నిలబడి ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొంగారెడ్డిపల్లిలోని షర్మన్ బాలికోన్నత పాఠశాలలోని 50వ పోలింగ్ కేంద్రంలో చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జేసీ శ్రీనివాసులు క్యూలో నిలబడి ఓటేశారు.

కమాండ్ కంట్రోల్ రూమ్ పరిశీలన

చిత్తూరు కలెక్టరేట్, మే 13: కలెక్టరేట్‌లోని కొత్త స్పందన హాలులో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌ను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ షన్మోహన్ పరిశీలించారు. ఎస్పీ మణికంఠ చందోలుతో కలిసి ఉదయం 7 గంటల వరకు మాక్ పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈవీఎంలు మొరాయించిన చోట వెంటనే సరిచేసి పోలింగ్ ప్రక్రియకు ఇబ్బంది లేకుండా చేశారు. వెబ్‌కాస్టింగ్ ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ సరళిని నిశితంగా పరిశీలించారు. సాధారణ పరిశీలకులు షాదిక్ అలామ్, కైలాష్ వాంఖ్డే, పోలీసు అబ్జర్వర్ అరవింద సాల్వే, చిత్తూరు పార్లమెంటు సెగ్మెంట్ వ్యయ పరిశీలకుడు శంకర్ ప్రసాద్ శర్మ వారి వెంట ఉన్నారు.

సమస్యాత్మక కేంద్రాల వద్ద పటిష్ట భద్రత

చిత్తూరు, మే 13: ఎన్నికల పోలింగ్ ప్రక్రియలో భాగంగా సమస్యాత్మక ప్రాంతాల్లో డీఎస్పీ స్థాయి అధికారులతో పటిష్ట భ ద్రత ఏర్పాటు చేసినట్లు ఎస్పీ మణికంఠ చందోలు తెలిపారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే పరిష్కరించే విధంగా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఉదయం 7 గంటలకు ఆయన పూతలపట్టు నియోజకవర్గంలోని అగ్రహారం బూత్‌ను సందర్శించారు. ఓటర్లతోపాటు వృద్ధులు, బాలింతలు, మహిళలు స్వేచ్ఛగా ఓటు వేసేలా పోలీసు శాఖ తరఫున చర్యలు తీసుకున్నామన్నారు. ఎస్పీతోపాటు జిల్లా స్పెషలాఫీసర్ ఈశ్వరరావు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

రిజర్వు ఉద్యోగులకు డ్యూటీ ఇవ్వని ఈఆర్వో



పుంగనూరు స్త్రీశక్తి భవన్‌లో వేచి ఉన్న రిజర్వు పోలింగ్ సిబ్బంది

పుంగనూరు రూరల్, మే 13: సౌకర్యాలు కల్పించకుండా ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఇబ్బంది పెట్టారని పుంగనూరు నియోజకవర్గంలో పోలింగ్ విధులకు వచ్చిన రిజర్వు ఉద్యోగులు ఆరోపించారు. ఆదివారం తెల్లవారుజామున చిత్తూరు, కుప్పం, నగరి, పూతలపట్టు తదితర నియోజకవర్గాల నుంచి రిజర్వు పోలింగ్ విధులకు 150 మంది వచ్చారు. శుభారాం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో వేచి ఉండగా మధ్యాహ్నం భోజనం పెట్టి, తర్వాత వారి గురించి ఎవరూ పట్టించుకోలేదు. ఈ విషయమై ఈఆర్వో మధుసూదన్‌రెడ్డితో మాట్లాడగా ఎక్కడైనా బంధువుల ఇళ్లలో ఉండాలని, తాము పిలిచిన 15 నిమిషాల్లో ఇక్కడకు చేరుకోవాలని చెప్పడంతో వారు అవాక్కయ్యారు. దీంతో రాత్రి భోజనం, వసతి లేక మహిళా ఉద్యోగులు అవస్థలు పడ్డారు. కొందరు వెనక్కు వెళ్లిపోయారు. సోమవారం వెళ్లి తమకు డ్యూటీ కేటాయించకపోతే అలెవెన్స్ ఇస్తే వెళ్లిపోతామని అడగ్గా బుధవారం రావాలని చెప్పడంతో ఏమి చేయాలో వారికి పాలుపోలేదు. ఈ విషయమై ఈఆర్వో మధుసూదన్‌రెడ్డిని వివరణ కోరగా ఆదివారం రాత్రే పుంగనూరు నుంచి ఆర్టీసీ బస్సులో నగరికి ఉద్యోగులను పంపామని, మిగిలిన వారికి అలెవెన్స్ బుధవారం ఇస్తామని చెప్పామని అన్నారు.



చౌడేపల్లె మండలం కాగతిలో సోమవారం రాత్రి 8 గంటలకు ఓటేసేందుకు వేచివున్న ఓటర్లు



విజయపురం మండలం కేవీపురంలో సాయంత్రం 6 గంటలకు బారులు తీరిన ఓటర్లు



కుప్పం మండలం మంకలదొడ్డి 222 బూత్ వద్ద అస్తవ్యస్త క్యూలైన్లతో ఓటర్ల ఇబ్బందులు



పోలింగ్ సమయం పూర్తవడంతో క్యూలో ఉన్నవారికి టోకెన్లు జారీచేస్తున్న అధికారులు - రాత్రి 7 గంటలకు గేట్లు దూకి లోనికి ప్రవేశిస్తున్న వైసీపీ మద్దతుదారులు



కీలపట్ల 99వ బూత్ వద్ద ఓటు వేయడానికి గుమిగూడిన ఓటర్లు

సమయం మించినా..

క్యూలోకి వచ్చిన వైసీపీ నేతలు

అడ్డుకున్న అధికారులపై తిరగబడిన వైనం

కీలపట్ల, గుండుగల్లు, గంగవరం, కొత్తపల్లెల్లో రాత్రి 8, 9 గంటల వరకు ఓటింగ్

గంగవరం, మే 13 : సమయం మించిపోయినా వైసీపీ నేతలు క్యూలోకి ప్రవేశించడమేగాక అడ్డుకున్న అధికారులపై తిరగబ డడం చర్చనీయాంశంగా మారింది. పోలింగ్ సమయం 6 గంటలకు పూర్తయిన వెంటనే గంగవరం, గుండుగల్లు, కొత్తపల్లె, కీలపట్ల బూత్‌లలో క్యూలో ఉన్న వారందరికీ అధికారులు టోకెన్లు పంపిణీ చేసి, గేట్లకు తాళాలు వేశారు. కీలపట్లలో స్లిప్పులు ఇచ్చిన వారు ఓటువేసి, అదే స్లిప్పులను గేటుబయట ఉన్న వారికి అందించారు. వారు తమ వద్ద స్లిప్పులు ఉన్నాయని, మమ్మల్ని ఎందుకు లోనికి అనుమతించరని పోలీసు సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. తాళం తీసే ప్రసక్తే లేదని పోలీసులు తెగేసి చెప్పారు. ఇంతలో కొంతమంది వైసీపీ చోటా లీడర్లు స్లిప్పులున్న వారి అనుచరులను గేట్లు, గోడలు దాటించి లోనికి పంపించారు. పోలింగ్ సిబ్బంది గమనించి వారిని అడ్డుకోవడానికి ప్రయత్నించగా తిరగబడి హంగామా సృష్టించారు. దీంతో అధికారులు సైతం మిన్నకుండిపోయారు. కాగా, ఈవీఎంల పనితీరు మందకొడిగా ఉండడంతో మండలంలోని గుండుగల్లు, గంగవరం, కొత్తపల్లెలలో రాత్రి 8 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. కీలపట్లలో మాత్రం రాత్రి 9 గంటల వరకు కొనసాగింది. దండపల్లెలో అర్ధ గంట పాటు ఈవీఎం మొరాయించినా టెక్నికల్ సిబ్బంది సరిజేయడంతో పోలింగ్ ప్రక్రియ కొనసాగింది. గుండుగల్లులో వైసీపీ నాయకులు దొంగ ఓట్లు వేయించడానికి ప్రయత్నిస్తున్నారని టీడీపీ ఆరోపించడంతో వాగ్వాదాలు, తోపులాటలు చోటుచేసుకున్నాయి. పోలీసులు శాంతింపజేశారు. దండపల్లె బూత్ ఎదుట వైసీపీ నాయకులు ఫ్యాన్‌కు ఓటేయాలని బలవంతం చేయగా, టీడీపీ నాయకులు అడ్డుకోగా స్వల్ప వాగ్వివాదం చోటుచేసుకుంది. గంగవరం, మబ్బువాళ్లపేట, మారెడుపల్లె, దండపల్లె లతోపాటు పలు కేంద్రాల్లో మహిళలు, పురుషులకు వేర్వేరుగా క్యూలు ఏర్పాటు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కీలపట్లలో పోలింగ్ బూత్‌లను కుదించేయడంతో రాత్రి 9 గంటల వరకు ఓటర్లు బారులు తీరారు. ఓటు వేయడానికి 3 నుంచి 4 గంటలు పట్టడంతో ఓటర్లు తిరగబడ్డారు.

దొంగ ఓట్లను అడ్డుకున్నారని..

టీడీపీ నేతలపై వైసీపీ శ్రేణుల దాడి

పుంగనూరు, మే 13: దొంగ ఓట్లను అడ్డుకున్నారనే కోపంతో పోలింగ్ అనంతరం తెలుగుదేశం పార్టీ నేతలపై వైసీపీ శ్రేణులు దాడులకు తెగబడ్డాయి. ఎంపీడీవో కార్యాలయం, తాటిమాకులపాళ్యం పోలింగ్ కేంద్రాల్లో టీడీపీ ఏజెంట్లు దొంగ ఓట్లకు అనుమతించకపోవడంతో వైసీపీ నాయకులు వాగ్వాదానికి దిగారు. వైసీపీకి ఓట్లు వేయాలని కౌన్సిలర్ నటరాజ ప్రచారం చేస్తుండటంతో టీడీపీ మాజీ కౌన్సిలర్ దేశాది ప్రకాశ్ అడుకున్నారు. వీరి మధ్య గొడవ జరిగింది. తాటిమాకులపాళ్యం పోలింగ్ కేంద్రంలో ప్రకాశ్ ఓటు వేయడానికి వెళ్లగా వైసీపీ శ్రేణులు దుర్భాషలాడాయి. అదే సమయంలో తన ఓటు అడ్డుకున్నారని వైసీపీకి చెందిన బండ కుమార్ గొడవకు దిగారు. పోలింగ్ అనంతరం వారి వారి ఇళ్లకు వెళ్లారు. ఈ క్రమంలో తాటిమాకులపాళ్యంలో దేశాది ప్రకాశ్ ఇంటిపై వైసీపీ కౌన్సిలర్ నటరాజ, పార్టీ కార్యకర్తలు బండ కుమార్, సాగర్, సునీల్ తదితరులు రాళ్లు, కర్రలతో ఇంటి వద్దకు వచ్చి దుర్భాషలాడుతూ దాడి చేయడానికి ప్రయత్నించారు. దేశాది ప్రకాశ్ ఫిర్యాదు చేయడంతో ఏఎస్పీ సుబ్బరాజు ఆధ్వర్యంలో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వారిని అక్కడ నుంచి పంపించేశారు. అలాగే స్థానిక కొత్తయిండ్లు పోలింగ్ కేంద్రంలో దొంగ ఓట్లు అనుమతించలేదని టీడీపీ ఏజెంట్లు నరేశ్‌రాయల్, రమేశ్‌లను కొట్టాలని అధిక సంఖ్యలో పోలింగ్ కేంద్రం వద్దకు వైసీపీ శ్రేణులు వచ్చాయి. దీంతో పోలింగ్ ముగిసినా వారు పోలీసులకు సమాచారం ఇచ్చి అక్కడే ఉన్నారు. ఈ క్రమంలో నరేశ్‌రాయల్, రమేశ్‌లను ఏఎస్పీ సుబ్బరాజు తన వాహనంలో ఇళ్లకు పంపారు.

అదనపు బలగాలెక్కడ?

- నాలుగు కేంద్రాలకూ ఒక్కరే కానిస్టేబుల్
- ఘర్షణల నియంత్రణలో పోలీసుల వైఫల్యం

చిత్తూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో 1,500 మందికిపైగా పోలీసు సిబ్బంది ఉండగా, మరో 1,500 మందికిపైగా అదనపు బలగాలను తెప్పించినట్లు పోలీసు అధికారులు చెప్పారు. 3 వేల మందికి పైగా పోలీసులతో పకడ్బందీగా ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. అయితే జిల్లాలోని చాలా పోలింగ్ ప్రాంతాల్లో ఒకరే కానిస్టేబుల్ కనిపించారు. దీంతో ఘర్షణలను నిలువరించలేకపోయారు. ఎస్టీఎఫ్ బలగాలు వచ్చే సరికి జరగాల్సిన ప్రమాదం జరిగిపోయింది. చిత్తూరు నగరం మంగసముద్రంలో టీడీపీ శ్రేణులను వైసీపీ నాయకులు కొట్టాక బలగాలు వచ్చి చెదరగొట్టాయి. షర్మన్ వద్ద టీడీపీ అభ్యర్థి గురజాల వాహనానికి అడ్డుగా 10 నిమిషాలపాటు వైసీపీ నేత పురుషోత్తంరెడ్డి తన వాహనాన్ని అడ్డుపెట్టారు. అక్కడా పోలీసులు కనిపించలేదు. యాదమరి మండలం ముస్లింవాడలో దొంగ ఓట్లు వేసుకుంటున్న వైసీపీ వాళ్లను టీడీపీ శ్రేణులు అడ్డుకోగా కత్తులతో దాడి చేశారు. అక్కడా ఒక్కరే కానిస్టేబుల్ ఉండడంతో అడ్డుకోలేకపోయారు. అదే మండలం కాశిరాల, కోడిగుట్ట కేంద్రాల్లో వైసీపీ వాళ్లు ఓటర్లను బెదిరించి, కేంద్రాల్లోకి రాకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారు. అక్కడా ఒక్కడే కానిస్టేబుల్ ఉండడంతో వైసీపీ వాళ్లను నిలువరించలేకపోయారు. జీడీనెల్లూరు మండలం బాలగంగనపల్లె కేంద్రం వద్ద ఇరు పార్టీ వర్గాలు గుంపులుగా చేరుకుని వాగ్వాదం చేసుకున్నారు. ఇక్కడున్న కానిస్టేబుల్ నిలువరించలేక విఫలమయ్యారు. ఇలా ప్రతిచోటా పోలీసుల వైఫల్యం స్పష్టంగా కనిపించింది.



చిత్తూరులోని జడ్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బూత్‌లో వేచివున్న ఓటర్లు

మొరాయించిన ఈవీఎంలు

- పలుచోట్ల ఆలస్యంగా పోలింగ్

చిత్తూరు, మే 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. ఐరాల మండలంలోని పుత్రమద్ది, తవణంపల్లెలోని పుణ్యసముద్రం కేంద్రాలు, నింద్ర మండలం 184 కేంద్రం, కుప్పంలోని 168, 132, 197 కేంద్రాలు, వెదురుకుప్పం మండలం ఆళ్లమడుగు, మాంబేడు, కార్వేటినగరంలోని 91 కేంద్రం, గుడిపాల మండలం పేయినపల్లె, వి.కోట మండలం 170, 171 కేంద్రాలు, కార్వేటినగరం మండలం 103 కేంద్రం, పాలసముద్రం మండలం శ్రీబొమ్మరాజుపురం, వి.కోట మండలం 196 కేంద్రం, శాంతిపురం మండలం శివరాంపురం, జీడీనెల్లూరు మండలం పాతవెంకటాపురం, చౌడేపల్లె మండలం 106, 107 తదితర కేంద్రాల్లో ఈవీఎంలు మొరాయించాయి. ఆలస్యంగా పోలింగ్ మొదలవడంతో చాలా కేంద్రాల్లో రాత్రి 10 గంటలకు కూడా ఓటర్లు క్యూలో ఉన్నారు. వి.కోట మండలం జొన్నపల్లె కేంద్రంలో, బంగారుపాళ్యం మండలం తంబుగానిపల్లెలో సుమారు 300 మంది రాత్రి క్యూలో ఉన్నారు. వి.కోట మండలంలో సుమారు 8 కేంద్రాల్లో, చౌడేపల్లె మండలంలోని ఐదు కేంద్రాల్లో, పులిచెర్ల మండలం మతుకువారిపల్లెలో, బంగారుపాళ్యంలోని కచ్చేటివారిపల్లెలో, గంగవరం మండలం కీళ్లపట్ల, కొత్తపల్లె, గంగవరం కేంద్రాల్లో, సోమల మండలం పొదలగుంట పల్లె, టీ.గొల్లపల్లె, పూతలపట్టు మండలం గొడుగుచింతలో రాత్రి 10 గంటలు దాటినా పోలింగ్ కొనసాగింది.



స్ట్రాంగ్ రూములకు చేరుకుంటున్న ఈవీఎంలు

చిత్తూరు కలెక్టరేట్, మే 13 : సార్వత్రిక ఎన్నికల పోటీలోని అభ్యర్థుల భవితవ్యం తేల్చే ఈవీఎం మిషన్లు సోమవారం రాత్రి 10 గంటల నుంచి చిత్తూరులోని ఎస్ వి సెట్ ఇంజనీరింగ్ కళాశాలకు చేరుకుంటున్నాయి ఇక్కడ 10 రిసీవింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పీవో డెయిరీలతో పాటు ఎన్నికల్లో వాడిన పోలింగ్ సామగ్రిని అధికారులు అందజేస్తున్నారు. తొలుత చిత్తూరు అసెంబ్లీ నియోజవర్గాలకు సంబంధించిన ఈవీఎంలు చేరుకున్నాయి. జిల్లాలో మిగిలిన ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల ఈవీఎంలు గట్టి పోలీసు బందోబస్తు నడుమ తరలిస్తున్నారు. మంగళవారం సాయంత్రానికి పూర్తి స్థాయిలో తరలించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కలెక్టర్, జేసీ సమక్షంలో అర్ధరాత్రి నుంచి నియోజకవర్గాల వారీగా వాటిని భద్రపరుస్తారు.

బెడిసికొట్టిన వైసీపీ వ్యూహం

బైండోవర్ కేసులు పెట్టినా ఈసీ నిర్ణయంతో ఏజెంట్లుగా ప్రతిపక్ష నేతలు

పుంగనూరు, మే 13: పుంగనూరు నియోజకవర్గంలో పోలీసుల సాయంతో వైసీపీ పన్నిన వ్యూహం బెడిసికొట్టింది. ప్రత్యర్థులపై రౌడీషీట్లు తెరిచి, పోలింగ్ ఏజెంట్లుగా అవకాశంలేకుండా చేయాలన్న ఆలోచన ఫలితం ఇవ్వలేదు. గత ఏడాది ఆగస్టు నాలుగో తేదీ పుంగనూరు శివార్లలోని భీమగానిపల్లె వద్ద కృష్ణదేవరాయల విగ్రహం వద్ద టీడీపీ అధినేత చంద్రబాబు పర్యటన సందర్భంగా గొడవ జరిగింది. పోలీసులు లాఠీచార్జి చేశారు. పోలీసులే ఫిర్యాదుదారులుగా టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డితోపాటు 498 మందిపై వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. అదే సమయంలో రౌడీషీట్ అస్త్రాన్ని ప్రయోగించారు. మూడు కేసులున్న దాదాపు 100 మంది టీడీపీ నేతలపై రౌడీషీట్లు తెరిచారు. కానీ ఎన్నికల సంఘం నిబంధనలతో టీడీపీ శ్రేణులకు ఎలాంటి ఇబ్బందీ లేకుండా టీడీపీ అభ్యర్థి సంతకంతో ఉన్న పత్రాన్ని తీసుకుని ఏజెంటుగా కూర్చున్నారు.

కలకలం రేపిన వీవీప్యాట్‌లోని చిత్రం

సోషల్ మీడియాలో హల్‌చల్



పలమనేరు, మే13 : పోలింగ్ స్టేషన్‌లో ఓటు హక్కు వినియోగించుకునే వారు మాత్రమే చూడగలిగే వీవీప్యాట్‌లో ఓటు వేసిన చిత్రం సోమవారం పలమనేరులో సోషల్ మీడియాలో హల్‌చల్ చేసింది. వీవీప్యాట్‌లో ఓటు అమరనాథరెడ్డికి పోల్ చేసినట్లు సైకిల్ గుర్తుతోపాటు గ్రూప్ అడ్మిన్ మోహన్ సోషియల్ మీడియాలో పోస్టు చేశారు. సెల్‌ఫోన్లు పోలింగ్ కేంద్రంలోకి అనుమతి లేని సమయంలో ఈ చిత్రం బయటకు ఎలా వచ్చిందనేది పెద్ద చర్చనీయాంశంగా మారింది. పలమనేరు నియోజకవర్గ ఎన్నికల అధికారి మనోజ్‌రెడ్డిని వివరణ కోరగా దర్యాప్తు చేస్తున్నామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మద్యం తాగి ఒకరి మృతి



వెంకటేష్ (ఫైల్ ఫొటో)

కార్వేటినగరం, మే 13: మద్యం తాగి కార్వేటినగరం పంచాయతీ ఆదిఆంధ్రవాడకు చెందిన వెంకటేష్(63) ఆదివారం రాత్రి మృతి చెందాడు. సోమవారం ఎన్నికల పోలింగ్ కావడంతో ప్రధాన పార్టీల నాయకులు రాత్రి మద్యం పంపిణీ చేశారు. పరిమితికి మించి తాగడంతో మృతిచెందినట్లు కాలనీవాసులు తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. కుటుంబానికి పెద్దదిక్కు చనిపోవడంతో దిక్కులేని వారయ్యారు.

కర్ణాటక మద్యం పట్టివేత : ఇద్దరి అరెస్ట్



కార్వేటినగరం, మే 13: కార్వేటినగరం ఎక్సైజ్ సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పచ్చికాపలం వద్ద రూ.54 వేల విలువైన కర్ణాటక మద్యం స్వాధీనం చేసుకున్నట్లు స్పెష ల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి లక్ష్మీదుర్గయ్య తెలిపారు. వెదురుకుప్పం మండలం తెల్లగుండ్లపల్లి గ్రామానికి చెందిన చొక్కా ప్రతాప్ నుంచి 26 బాటిళ్లు, గోవిందవారిపల్లెకు చెందిన మల్లికార్జున నుంచి 32 కర్ణాటక మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని, ఇద్దరినీ రిమాండుకు తరలించినట్లు చెప్పారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐలు నాగరాజు, భారతి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యాచకుడి మృతి



మృతిచెందిన గోవిందయ్య

శ్రీరంగరాజపురం, మే 13: రోడ్డు ప్రమాదంలో యాచకుడు మృతిచెందిన ఘటన మండలంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు.. గోవిందస్వామి (70) రోడ్లపై చెత్త ఏరుకుంటూ, ఇంటింటికీ వెళ్లి యాచించి పొట్టపోసుకునే వాడు. ఎస్ఆర్‌పురం మండలం కనికపురం గ్రామ సమీపంలో రోడ్డుపై చెత్త ఏరుకుంటుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆయన అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీఆర్వో ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

అంబేడ్కర్‌కు అపచారం



అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళనకు దిగిన దళిత సంఘాలు

వెంకటగిరి/ డక్కిలి, మే 13 : వెంకటగిరి పట్టణ నడిబొడ్డులో ఉన్న అంబేడ్కర్ విగ్రహం తలనరికి దూరంగా విసిరేసిన ఘటన సంచలనం రేకెత్తించింది. వెంకటగిరి రైల్వేస్టేషన్‌కు వెళ్లే మార్గంలో రోడ్డుకు ఆనుకొని వున్న విగ్రహం తలనరికి దూ రంగా పడేసి ఉన్న విషయాన్ని సోమవారం తెల్లవారుజామున స్థానికులు గుర్తించారు. ఈ విషయం తెలుసుకొన్న దళిత సంఘాలు పోలీసులకు ఫిర్యాదు చేశాయి.ఆ ప్రాంతంలో సీసీ కెమెరాలు లేకపోవడంతో ఈ దారుణానికి ఒడిగట్టిందెవరన్న విషయం తేలలేదు.దీనిపై మంగళవారం నిరసన కార్యక్రమం చేపట్టాలని దళిత సంఘాల నేతలు నిర్ణయించాయి.

వివాదాలు.. గొడవలు

ఆంధ్రజ్యోతి, చిత్తూరు: జిల్లాలో సోమవారం పోలింగ్ సందర్భంగా పలు కేంద్రాల్లో వివాదాలు, గొడవలు చోటుచేసుకున్నాయి.

డిజిటల్ అసిస్టెంట్‌పై జనాగ్రహం



వి.కోట మండలం కుంబార్లపల్లె కేంద్రంలో ఓటరు స్లిప్పుల్ని పంపిణీ చేయకుండా ఉంచుకున్నందుకు డిజిటల్ అసిస్టెంట్ మీద ఓటర్లు ఆగ్రహించారు. వైసీపీ స్లిప్పుల్ని పంపిణీ చేసి, మిగిలినవి అందించలేదని నిలదీశారు.

నమూనా ఈవీఎంతో..



వి.కోట మండలం తోటకనుమ పోలింగ్ కేంద్రం పక్కనే మోడల్ బ్యాలెట్‌తో వైసీపీ కార్యకర్తలు హల్‌చల్ చేశారు. దీనిపై విపక్షాలు ఆగ్రహం వ్యక్తంచేశాయి. వి.కోటలోని బాలికోన్నత పాఠశాలలో సాయంత్రం ఆరు దాటినా ఓటు వేసేందుకు వచ్చిన వారిని అనుమతించాలనడంతో ఇరు వర్గాల మధ్య తోపులాట చోటుచేసుకుంది.

- చౌడేపల్లె మండలం చారాల 119, 120 కేంద్రాల్లో ముగ్గురు వలంటీర్లు ఏజెంట్లుగా కూర్చున్నారని టీడీపీ నాయకులు ఫిర్యాదు చేశారు. దీంతో టీడీపీ- వైసీపీ మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. వలంటీర్లను కేంద్రం నుంచి పీవో పంపించేశారు.
- నగరి పట్టణంలోని కొత్తపేట తమిళ ఉన్నత పాఠశాల వద్ద వైసీపీ, టీడీపీ వర్గీయుల మధ్య వాగ్వాదాం చోటు చేసుకోగా, పోలీసులు తరిమికొట్టారు.
- యాదమరి మండలం కాశిరాల, కోడిగుట్ట కేంద్రాల్లో వైసీపీ వాళ్లు ఓటర్లను బెదిరించి, కేంద్రాల్లోకి రాకుండా అడ్డుకున్నారని టీడీపీ నేతలు ఆరోపించారు. అక్కడ ఒకరే కానిస్టేబుల్ ఉండడంతో నిలువరించలేకపోయారని ఫిర్యాదు చేశారు.
- చిత్తూరు నగరం 24, 27 పోలింగ్ కేంద్రాల్లో వైసీపీ కార్పొరేటర్ హరిణిరెడ్డి ఓటర్లకు బహిరంగంగా డబ్బులు పంపిణీ చేసినా పోలీసులు పట్టించుకోలేదని టీడీపీ నాయకులు ఆరోపించారు.
- పూతలపట్టు మండలం సంజీవరాయునిపల్లె పోలింగ్ కేంద్రంలో వైసీపీ నేతలు ఓటర్ల నుంచి స్లిప్పుల్ని లాక్కుని దొంగ ఓట్లు వేసే ప్రయత్నాన్ని టీడీపీ అభ్యర్థి మురళీమోహన్ అడ్డుకున్నారు.

‘స్టేటస్’లో మాక్‌పోలింగ్ ఫొటో

- వైసీపీ సర్పంచిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

రామకుప్పం, మే 13: రామకుప్పం మండలం ముద్దనపల్లె పోలింగ్ బూత్‌లో మాక్ పోలింగ్ ఫొటోను తీసి వైసీపీకి చెందిన సర్పంచు సికిందర్ తన వాట్సాప్ స్టేటస్‌లో పెట్టారు. వాట్సాస్ స్టేటస్‌ను స్థానికులు స్ర్కీన్‌షాట్ తీసి పోలీసులకు పంపారు. దీనిపై స్పందించిన పోలీసులు సికిందర్‌ను అదుపులోకి తీసుకుని పోలీసు స్టేషన్‌కు తరలించారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

పోలింగ్ ప్రశాంతం

- పలుచోట్ల మొరాయించిన ఈవీఎంలు
- ఆలస్యంగా పోలింగ్ ప్రారంభం


నీడలేక ఎండలో నిల్చున్న ఓటర్లు


రేణిగుంట బాలికల ఉన్నత పాఠశాలలో బారులుతీరిన మహిళా ఓటర్లు


ఏర్పేడులో క్యూలో నిరీక్షిస్తున్న ఓటర్లు


శ్రీకాళహస్తిలో డమ్మీ ఈవీఎం స్వాధీనం చేసుకున్న అధికారులు


ఓటింగ్‌కు రావాలని కేసీ కండ్రిగవాసులకు నచ్చచెబుతున్న నాయకులు

శ్రీకాళహస్తి, మే 13: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మొత్తం 293 బూత్‌లలో పోలింగ్ నిర్వహించారు. శ్రీకాళహస్తి పట్టణంలోని తుఫాన్ సెంటర్, ఎన్టీఆర్ నగర్ ప్రాంతాల్లో ఉదయం మాక్ పోలింగ్ సందర్భంగా ఈవీఎంలు మొరాయించాయి. ఆ రెండు చోట్ల అర్ధగంట ఆలస్యంగా ఓటింగ్ ప్రారంభమైంది. ఇక పట్టణంలోని వాటర్ హౌస్ కాలనీ వద్ద రాజీనామా చేసిన వలంటీర్ ప్రవీణ్ బూత్ ఏజెంట్‌గా వ్యవహరించారు. ఆయన, మరికొందరు వైసీపీ ఏజెంట్లతో కలిసి వైసీపీ గుర్తులతో ఉన్న డమ్మీ ఈవీఎంలను పక్కనే పెట్టుకుని ఓటర్లకు చూపించారు. టీడీపీ ఏజెంట్లు నిలదీయడంతో వైసీపీ ఏజెంట్లు ఎదురుదాడికి దిగారు. దీంతో పెద్ద ఎత్తున టీడీపీ శ్రేణులు అక్కడికి చేరుకున్నారు. పోలీసులు డమ్మీ ఈవీఎంలను వెలుపలకు తరలించి పరిస్థితిని అదుపు చేశారు. ఇదే తరహాలో కుమారస్వామితిప్ప బూత్ వద్ద వైసీపీ కార్యకర్తలు డమ్మీ ఈవీఎంతో రోడ్డుపై ప్రచారం నిర్వహించారు. టీడీపీ నాయకులు అడ్డుకోవడంతో తీవ్రవాగ్వాదం చోటుచేసుకుంది. పట్టణంలోని పూసల వీధి పోలింగ్ బూత్ వద్ద టీడీపీ నాయకుడు లక్కమనేని మధును అంతు చూస్తామంటూ వైసీపీ శ్రేణులు బెదిరింపులకు దిగాయి. టీడీపీ వర్గాలు అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. పోలీసులు వజ్ర వాహనంతో అక్కడికి చేరుకుని పరిస్థితిని అదుపు చేశారు. ఇక పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల వద్ద వైసీపీ అభ్యర్థి మధుసూదనరెడ్డి పోలింగ్ కేంద్రాల్లో ప్రవేశించే సమయంలో పలువురు ఆయన వెంట చొరబడ్డారు. దీనిని టీడీపీ శ్రేణులు ప్రశ్నించారు. పలుమార్లు ఇదే పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ శ్రేణులు టీడీపీ వర్గీయులను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారు. ఎన్డీఏ అభ్యర్థి సుధీర్‌రెడ్డి అక్కడికి చేరుకున్నారు. వైసీపీశ్రేణులు కవ్వించే ప్రయత్నం చేసినా కూటమి శ్రేణులు సంయమనంతో వ్యవహరించారు.

● శ్రీకాళహస్తి మండలంలోని అక్కుర్తి పోలింగ్ కేంద్రంలో వైసీపీ ఏజెంట్లు ప్రచారం చేయడాన్ని బీజేపీ మండల అధ్యక్షుడ నాగరాజు ప్రశ్నించడంతో అతనిపై దాడి చేశారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, నాయకులు, కార్యకర్తలతో కలిసి అక్కుర్తికి చేరుకోవడంతో అక్కడ ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పుల్లారెడ్డికండ్రిక గ్రామంలో వైసీపీ ఏజెంట్లు, నాయకులు ఓటర్లను ప్రభావితం చేస్తుండడంతో కాసేపు వాగ్వాదం చోటు చేసుకుంది.

● తొట్టంబేడు మండలం కొత్తకండ్రిగలో ఈవీఎం మొరాయించడంతో అర్ధగంట పాటు పోలింగ్ ఆలస్యమైంది. పెద్దకన్నలి పోలింగ్ కేంద్రం వద్ద కాసేపు విద్యుత్ అంతరాయం ఏర్పడింది. చిట్టత్తూరులో ఈవీఎం మొరాయించడంతో పోలింగ్ ఆలస్యంగా ముగిసింది.

● ఏర్పేడు మండలంలో కోబాక వద్ద వైసీపీ వర్గీయులు సైగల ద్వారా ఓటర్లకు ప్రచారం చేస్తుండడంతో టీడీపీ శ్రేణులు ప్రశ్నించారు. ఇరువర్గాలు భారీగా అక్కడికి చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు ఇరువురిని చెదరగొట్టి పరిస్థితిని అదుపు చేశారు. రావిళ్ల వారి కండ్రిగ పోలింగ్ కేంద్రంలో వైసీపీ ఏజెంట్లు లోపల ఓటర్లకు ఫ్యాన్ చూపిస్తుండడంతో టీడీపీ ఏజెంట్ గణేష్ నాయుడు వారిని నిలువరించారు. ఈ క్రమంలో వైసీపీ ఏజెంట్లు తనపై దాడి చేశారంటూ గణేష్ నాయుడు ఆరోపించారు.

● రేణిగుంట బుగ్గ వీధి, కరకంబాడిలో ఈవీఎం యంత్రాలు మొరాయించడంతో ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. కరకంబాడి పోలింగ్ కేంద్రం వద్ద వైసీపీ నాయకులు ఓటర్లకు ప్రచారం చేయడాన్ని టీడీపీ నేతల ప్రశ్నించారు. ఇరువర్గాల మధ్య తీవ్రవాగ్వాదం చోటుచేసుకుని ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అనాసంపల్లిలో వైసీపీ ఏజెంట్లు కవ్వింపు చర్యలకు పాల్పడడంతో టీడీపీ నాయకులతో వాగ్వాదం చోటుచేసుకుంది.

శ్రీకాళహస్తిలో 78.30 శాతం పోలింగ్

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో 78.30 శాతం పోలింగ్ నమోదైంది. ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. చాలాచోట్ల గంట ముందు నుంచే ఓటర్లు ఆయా కేంద్రాల వద్దకు చేరుకున్నారు. అర్ధగంట ముందు నుంచే క్యూలైన్‌లలో బారులు తీరిపోయారు. ఎక్కడా సరైన సౌకర్యాలు లేకపోయినప్పటికీ ఓటు వేసేందుకు ఎంతో ఓపికగా నిరీక్షించారు. తీవ్రమైన ఎండలు ఉన్నప్పటికీ, పలుచోట్ల నీడ లేనప్పటికీ ఓటర్లు ఏమాత్రం లెక్క చేయలేదు. వృద్ధులు, వికలాంగుల సైతం ఓటుకు పోటెత్తారు. రాత్రి 10:40 గంటల వరకు కొన్నిచోట్ల పోలింగ్ కొనసాగింది. మొత్తం ఈవీయం యంత్రాలను అధికారులు స్ట్రాంగ్ రూమ్‌కు చేర్చారు. ఆ తరువాత తిరుపతికి తరలించారు.

సత్యవేడులో 83 శాతం

సత్యవేడు: నియోజకవర్గంలో పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. చాలాచోట్ల ఈవీఎంలు మొరాయించడంతో ఓటింగ్ ప్రక్రియ ఆలస్యంగా ప్రారంభమైంది. ఓటర్లు ఉదయం నుంచే పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరారు. నియోజకవర్గంలో మొత్తం 83శాతం పోలింగ్ నమోదైనట్లు అధికారులు తెలిపారు. కేవీబీపురం మండలం పాతపాళ్యం పంచాయతీ కేసీపురం గ్రామస్తులు తమ గ్రామంలో మౌలిక వసతుల ఏర్పాటు, రోడ్డు సౌకర్యం కల్పించేంత వరకు ఓటు వేసేది లేదని, ఎన్నికలను బహిష్కరిస్తున్నామంటూ నిరసనకు దిగారు. అధికారులు, నాయకులు గ్రామస్తులతో చర్చించి సర్దిచెప్పారు. సత్యవేడు మండలం కన్నావరంలో డబ్బులు సక్రమంగా పంచలేదని ఓటర్లు పోలింగ్ కేంద్రానికి రాలేదు. అప్రమత్తమైన నాయకులు పంపకాలు చేపట్టడంతో పదకొండు గంటల వరకు వచ్చి ఓటు వేశారు. సత్యవేడు మండలంలో బాలుర హైస్కూల్, కన్నావరం, మదనంజేరి, ఇరుగుళం నాగలాపురం మండలంలో టీపీకోట, వజ్జవారిరండ్రిగ, సురుటుపల్లె, కేవీబీపురం మండలంలో బైరాజుకండ్రిగ, వేములపూడి, కోవనూరు, పెరిందేశం, వరదయ్యపాళెం జడ్పీహైస్కూల్, కారిపాకం, పెద్దపాండూరు, అంబూరు, కళత్తూరు పోలింగ్ కేంద్రాల్లోని ఈవీఎంలలో సాంకేతిక సమస్యలు తలెత్తడంతో పోలింగ్ ఆలస్యంగా ప్రారంభమైంది. పలుచోట్ల రాత్రి పొద్దుపోయే వరకు పోలింగ్ కొనసాగింది.

ఓటర్లకు విద్యుత్ షాక్

సత్యవేడు మండలం చెరివి పోలింగ్ కేంద్రంలో అపశృతి చోటు చేసుకుంది. ఓటు వేయడానికి క్యూ లైన్‌లో బారులు తీరిన ఓటర్లు పక్కనే గోడకు ఉన్న వైర్లు తగలడంతో విద్యుత్ షాక్‌కు గురయ్యారు. ఓటర్లు భయభ్రాంతులకు గురై చెల్లాచెదురై పరుగులు తీశారు. పలువురు ఓటర్లు గాయాల పాలయ్యారు. దీంతో పోలింగ్ కేంద్రం వద్ద భయానక వాతావరణం నెలకొంది. పోలీసులు పరిస్థితిని చక్కదిద్దడంతో పోలింగ్ కొనసాగింది. పోలింగ్ కేంద్రం సమీపంలోనే మరో పక్కా భవనం ఉండగా పాత రేకుల షెడ్లలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయడంతో సమస్య తలెత్తింది.

● వరదయ్యపాళెం మండలం కువ్వాకుల్లిలో ఎస్ఐ ప్రతాప్ అత్యుత్సాహం ప్రదర్శించారు. వంద మీటర్ల అవతల ఉన్న టీడీపీ కార్యకర్తలపై విరుచుకుపడి జులుం ప్రదర్శించారు. పలువురు కార్యకర్తలపై లాఠీచార్జి చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. ఎస్ఐ తీరును నిరసిస్తూ టీడీపీ కార్యకర్తలు పోలీసు వాహనానికి అడ్డంగా నిలబడి నిరసన తెలిపారు. ఎస్ఐ దాడిలో కుర్చీలు విరిగిపోయాయి.

● వరదయ్యపాళెం మండలం బత్తవల్లం, సీఎల్ఎన్ పల్లెలో దొంగఓట్ల కలకలం రేగింది. బత్తలవల్లం గ్రామానికి చెందిన నాగమ్మ ఓటు వేసేందుకు పోలింగ్ కేద్రానికి చేరుకోగా, అంతకు ముందే ఆమె ఓటును ఎవరో వేసేశారని అధికారులు చెప్పడంతో ఆమె ఖంగుతింది. ఆమె తన ఓటు కోసం పట్టుబడడంతో పోలింగ్ అధికారులు చాలెంజ్ ఓటు కల్పించారు. దీంతో ఆమె సాయంత్రం ఓటుహక్కు వినియోగించుకుంది. అలాగే ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి పూణే నుంచి గ్రామానికి చేరుకుని పోలింగ్ కేంద్రానికి వెళ్లాడు. తీరా అక్కడ అయన ఓటు ఎవరో వేసేశారని చెప్పడంతో తీవ్ర నిరాశకు గురయ్యాడు.


వరదయ్యపాళెం మండలం కువ్వాకల్లి గ్రామంలో టీడీపీ శిబిరంపై దాడి చేసి కుర్చీలు విరగ్గొట్టిన ఎస్ఐ ప్రతాప్


బీఎన్‌కండ్రిగ మండలం వేణుగోపాలపురంలో ఈవీఎం మొరాయించడంతో గోడ పక్కన నీడలో కూర్చున్న గిరిజనులు


శ్రీకాళహస్తి పట్టణం పూసలవీధిలో టీడీపీ నేతలతో పోలీసుల వాగ్వాదం


పిచ్చాటూరు పోలింగ్ కేంద్రం వద్ద ఏఎస్పీ మహేంద్రమత్తె






శ్రీకాళహస్తి ఎన్టీఆర్ నగర్‌లో చెట్టు పైన షామియానా, ఎండలో ఓటర్లు - సహాయకులతో పోలింగ్ బూత్‌కు వెళుతున్న వృద్ధుడు - వరదయ్యపాళెంలో వృద్ధురాలిని మంచంపై తీసుకెళుతున్న గ్రామస్తులు - ఏర్పేడు, బీఎన్‌కండ్రిగలో వీల్‌చైర్‌లో వెళుతున్న వృద్ధులు


ఓటు హక్కు వినియోగించుకున్న ఎన్డీఏ కూటమి శ్రీకాళహస్తి, సత్యవేడు అభ్యర్థులు బొజ్జల సుధీర్‌రెడ్డి, కోనేటి ఆదిమూలం, శ్రీకాళహస్తి వైసీపీ అభ్యర్థి బియ్యపు మధుసూదనరెడ్డి, తిరుపతి ఎంపీ అభ్యర్థి గురుమూర్తి దంపతులు - మాజీ ఎమ్మెల్సీ జయచంద్రనాయుడు దంపతులు, మాజీ ఎమ్మెల్యేలు ఎస్సీవీ నాయుడు, హేమలత, ఆమె కుమార్తె హెలెన్

ఓటు కోసం ఒమన్ నుంచి..

వరదయ్యపాళెం, మే 12: ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడానికి పలువురు సుదూర ప్రాంతాల నుంచి తరలి వచ్చారు. వరదయ్యపాళెం మండలం సీఎల్ఎన్‌పల్లెకు చెందిన యువతి చందన ఒమన్ దేశంలో ఉంటున్నారు. ఆమె స్వగ్రామానికి వచ్చి తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. అలాగే సీఎల్ఎన్ పంచాయతీకి చెందిన డాక్టర్ రోహిణి హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో పనిచేస్తున్నారు. ఆమె ఆదివారం సాయంత్రానికి స్వగ్రామానికి చేరుకున్నారు. సోమవారం ఓటు వేశారు. ఇది ప్రభుత్వం మార్పునకు సంకేతాలు అని పలువురు అంటున్నారు.



పోటెత్తిన ఓటరు

పుత్తూరు అర్బన్, మే 13: పట్టణం, పల్లె తేడాలేదు.... అన్ని గ్రామాలు, వార్డుల్లో ఓటర్లు బారులు తీరారు. ఎండ వేడిమిని లెక్క చేయకుండా క్యూలైన్లలో నిరీక్షించి ఓటు హక్కు వినియోగించుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఉదయం ఆరుగంటల నుంచే పుత్తూరులో ఓటర్లు పోటెత్తారు. లక్ష్మీనగర్, నేషనూరు తదితర కేంద్రాల్లో ఈవీఎంల మొరాయింపుతో పోలింగ్ కొద్దిసేపు ఆగింది. తరువాత అధికారులు సరిచేయడంతో తిరిగి ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. అలాగే చెదురుమదురు సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా సాగింది. నేషనూరు, వేణుగోపాలపురం, గేటు పుత్తూరు, పైడిపల్లిలో టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య వాగ్వాదాలు చోటు చేసుకుంది. తిమ్మాపురం, మిట్టపల్లూరులో పోలీస్ కానిస్టేబుల్ ఓవర్‌యాక్షన్‌పై ఓటర్లు తిరగబడ్డారు. కనకంపాళెం, చెర్లోపల్లి, కల్యాణపురం తదితర పోలింగ్ కేంద్రాల వద్ద సాయంత్రం ఆరు దాటినా ఓటర్లు క్యూలైన్లలో వేచి ఉన్నారు. టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్, వైసీపీ అభ్యర్థి, రాష్ట్ర మంత్రి రోజా పుత్తూరులో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఎక్కడికక్కడ టీడీపీ కేడర్ పోలింగ్ కేంద్రాల వద్ద గట్టిగా నిలబడడంతో వైసీపీ చేతులెత్తేసింది.

వడమాలపేట: మండలంలో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. 24998 మంది ఓటర్లు ఉండగా, 31 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వడమాలపేటలోని 11వ పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించడంతో గంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. మండుటెండను సైతం లెక్క చేయకుండా ప్రజలు క్యూలైన్లలో గంటల తరబడి నిలబడి ఓటుహక్కును వినియోగించుకున్నారు. మొత్తం 76.8 శాతం పోలింగ్ జరిగినట్లు అధికారులు తెలిపారు. వడమాలపేటలోని రెండు కేంద్రాలు, ఓబీఆర్ కండ్రిగ, పత్తిపుత్తూరు, అప్పలాయగుంట, శ్రీబొమ్మరాజపురం, సీతారామాపురంలో సమయం దాటినా ఓటర్లు క్యూలైన్లలో ఉండటంతో పోలింగ్‌ను కొనసాగించారు. టీడీపీ అభ్యర్థి గాలి భానుప్రకాష్, వైసీపీ అభ్యర్థి రోజా మండలంలోని పోలింగ్ కేంద్రాల్లో పర్యటించి ఓటింగ్ సరళిని పరిశీలించారు.


పుత్తూరు బాలికల జూనియర్ కళాశాలలో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గాలి భానుప్రకాష్


గేటు పుత్తూరులో ఓటు వేసేందుకు వస్తున్న వృద్ధులు - వడమాలపేట మండలం శ్రీబొమ్మరాజపురంలో క్యూలైన్లలో వేచిఉన్న ఓటర్లు

పాత కక్షలతో దాడి
తండ్రీ, కొడుకుకు తీవ్ర గాయాలు

శ్రీకాళహస్తి, మే 13: పాత కక్షలతో దాడి చేయడంతో తండ్రి, కొడుకులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటన శ్రీకాళహస్తి మండలం గుంటకింద పల్లె సమీపంలోని సోమవారం చోటు చేసుకుంది. బాధితుల కుటుంబ సభ్యుల కథనం మేరకు... గుంటకిందపల్లి గ్రామానికి చెందిన హరిబాబు(48) చెనక్కాయలు వ్యాపారం చేస్తుంటారు. ఆయన పెద్దకొడుకు హేమకుమార్ గ్రామ సమీపంలోని ప్రైవేటు కర్మాగారంలో పనిచేస్తుంటాడు. రెండవ కొడుకు ప్రకాష్(23) ఇటీవల బీటెక్ పూర్తి చేశాడు. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ముక్కంటి ఆలయంలో ఒప్పంద ఉద్యోగిగా పనిచేస్తుంటాడు. హరిబాబు కుటుంబానికి వారితో పాత కక్షలు ఉన్నాయి. సోమవారం ద్విచక్ర వాహనంపై హేమకుమార్ ఇంటి నుంచి శ్రీకాళహస్తి పట్టణానికి బయలుదేరాడు. మార్గమధ్యలో ముక్కంటి ఆలయ ఒపంద ఉద్యోగితో సహా మరికొందరితో కలిసి కత్తులు, కర్రలతో ఎదురుపడటంతో వెనుతిరిగి ఇంటికి చేరుకున్నాడు. కాసేపటి తర్వాత కర్మాగారంలో విధులకు హాజరయ్యాడు. ఆ తర్వాత వారి ఇంటి వద్దకు పాతకక్షలు ఉన్నవారు కత్తులు చేతబట్టి వెళ్లారు. ఇది చూసిన హరిబాబు, తన కొడుకు చిన్న ప్రకాష్‌తో కలిసి పెద్దకొడుకు విధుల్లో ఉన్న కర్మాగారం వద్దకు ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. కర్మాగారం సమీపంలో వారిని అడ్డగించి కత్తులతో దాడి చేశారు. సమాచారం తెలుసుకున్న పెద్దకొడుకు అక్కడికి చేరుకున్నాడు. స్థానికులు అడుకోవడంతో ముక్కంటి ఆలయ ఒప్పంద ఉద్యోగ సహా అతని వెంట వచ్చిన దుండగులు పరారయ్యారు. క్షతగాత్రులను శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. శ్రీకాళహస్తి రూరల్ పోలీసులు కేసుపై విచారణ చేస్తున్నారు.

కూటమి గెలుపు ఖాయం: సుధీర్ రెడ్డి

శ్రీకాళహస్తి, మే 13: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎన్డీఏ కూటమి గెలుపు ఖాయమని ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జల సుధీర్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలింగ్ ఎన్డీఏ కూటమికి సానుకూలంగా సాగిందన్నారు. నియోజకవర్గంలో గత ప్రభుత్వంలో వైసీపీ ప్రజా శ్రేయస్సును గాలికి వదిలేసిందన్నారు. ముఖ్యంగా ఎమ్మెల్యే చేసిన అరాచకాలకు అంతులేకుండా పోయిందన్నారు. ఐదేళ్లపాటు ఓర్పుతో భరించిన ప్రజలు సోమవారం కసితో ఓటును వేశారని పేర్కొన్నారు. గతంలో శ్రీకాళహస్తి ప్రజలు టీడీపీని ఎంతగానో ఆదరించారన్నారు. తర్వాత మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు ప్రజల మదిలో ఇంకా పదిలంగా మెదులుతున్నాయన్నారు. తిరిగి గోపాలన్న పాలన కోసం ఓటర్లు పట్టం కట్టారన్నారు.